విద్యార్థి వెలుగు

Volume IX - Issue I - Jan 2026

నూతన ప్రారంభం

మారిన కాలం... మారని నిరీక్షణ

సంపాదకీయం

క్రీస్తులో నిత్య నూతనత్వం

మన జీవిత ప్రయాణంలో, మనకు తెలియకుండానే ఎన్నో మలుపులు, ముగింపులు, ఆపై ఊహించని నూతన ఆరంభాలు ఎదురవుతూనే ఉంటాయి. నిన్నటి సూర్యాస్తమయం నిరాశను మిగిల్చినా, ప్రతి సూర్యోదయం ఒక క్రొత్త నిరీక్షణను తీసుకొస్తుంది. అయితే, క్రీస్తును నమ్మిన మన జీవితంలో, 'నూతన ఆరంభం' అనేది కేవలం కాలంతో వచ్చే మార్పు కాదు; అది దేవుని నిరంతర కృప మరియు మహోన్నత వాగ్దానం.

"క్రీస్తుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము, క్రీస్తుయేసునందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండబెట్టెను" (ఎఫెసీ 2:7). ఈ వాక్యం మనకు భవిష్యత్తుపై అపారమైన నమ్మకాన్ని ఇస్తుంది.

విశ్వాసులుగా అత్యంత గొప్ప నూతన ఆరంభం ఏదైనా ఉందంటే, అది దేవుడు మనకు ఇచ్చిన రెండవ అవకాశం – అదే రక్షణ. మొదటి మానవుడైన ఆదాము పతనం ద్వారా మనిషికి, దేవునికి మధ్య బంధం తెగిపోయింది. అదొక చేదు ముగింపు. కానీ, ప్రేమమయుడైన మన తండ్రి తన ప్రణాళికను ఆపుకోలేదు. ఆయన ప్రవక్తల ద్వారా పాత నిబంధనను స్థాపిస్తూ, చివరకు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపడం ద్వారా, మానవాళికి అసాధారణమైన నూతన ఆరంభాన్ని ఇచ్చారు.

యేసు పునరుత్థానం కేవలం ఒక చారిత్రక సంఘటన కాదు; అది పాతదంతా గతించిపోయి, నూతన సృష్టి ఆరంభానికి పలికిన గంభీరమైన నాంది. అందుకే అపొస్తలుడైన పౌలు ధైర్యంగా ఇలా అంటాడు: "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17).

విశ్వాసులంగా, నిత్యం మన హృదయంలో ఒక నిరంతర పోరాటాన్ని ఎదుర్కొంటాము: పాత స్వభావం వర్సెస్ క్రొత్త స్వభావం. నిజమైన నూతన ఆరంభం మన ఇంటి గోడల నుండి కాదు, మన హృదయం లోపలి నుండే మొదలవుతుంది. మన పొరపాట్లను, పాపాలను పశ్చాత్తాపంతో ఒప్పుకుని, దేవుని సన్నిధిలో క్షమాపణ అడిగినప్పుడు, ఆయన మన పాపాలను "తూర్పు పడమరలంత దూరంగా" ఉంచుతాడు (కీర్తన 103:12). అదొక అద్భుతమైన విముక్తి.

ఈ నూతన ఆరంభంలో మన లక్ష్యం కేవలం పాపాన్ని విడిచిపెట్టడం మాత్రమే కాదు, దేవుని పోలికగా సృష్టించబడిన నూతన మనుష్యుడిని ధరించుకోవడం. దేవుని ఆత్మ మనలో నివసిస్తూ, మనల్ని ప్రతిరోజు, ప్రతి క్షణం రూపాంతరం చెందిస్తాడు.

"కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తియందు నూతనపరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగల వారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీనస్వభావమును ధరించుకొనవలెను." (ఎఫెసీ 4:22-24).

ప్రతిరోజు ఉదయం మనం కళ్ళు తెరచినప్పుడు, మన దేవుడు మనకు కేవలం శ్వాసను మాత్రమే కాదు, కొత్త జీవితం, కొత్త బలం, కొత్త కృపను ఇస్తున్నాడనే విషయాన్ని మనం గమనించాలి. అందుకే ప్రవక్త ఇలా అన్నాడు: "ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది... అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది" (విలాప 3:22-23).

ఈ రోజు, దేవుడు మనకిస్తున్న ఈ నూతన ఆరంభాలను ఆస్వాదిద్దాం! మనం ఎంత పెద్ద పొరపాటు చేసినా, ఎంతగా వెనుకబడ్డా సరే, దేవుని అపారమైన కృప దాన్ని మించి ఉంటుంది. పాత విచారాలను, గత పరాజయాలను, అపరాధ భావాలను తీసుకెళ్లి క్రీస్తు సిలువ దగ్గర వదిలిపెడదాం.

మనం ఈ క్షణమే దేవునితో ఒక సరికొత్త బంధాన్ని ఆరంభిద్దాం. మన జీవితాన్ని సంపూర్ణంగా ఆయన చేతికి అప్పగించి, ఆయన ఇష్టానుసారంగా నడుచుకోవడానికి దృఢమైన నిర్ణయం తీసుకుందాం.

నూతన ఆరంభం అనేది మనం చేరుకోవాల్సిన ఒక గమ్యం కాదు, అది మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా నిత్యం సాగిపోయే ఒక అద్భుతమైన విశ్వాస యాత్ర. ఆ పాత జీవితపు బంధకాలను, సంకెళ్లను తెంచుకొని, యేసుక్రీస్తులో లభించే నిత్య నూతన జీవితంలో ధైర్యంగా అడుగులు వేద్దాం.

దేవుడు మనలను నిండుగా ఆశీర్వదించును గాక! ఆమెన్.

– కె. జాన్ భూషణం

విద్యార్థి వెలుగు

Vol. IX - Issue I - Jan 2026

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

EDITORIAL BOARD

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

Advisor:
Mr. S. Simon, Hyderabad

Members:
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. V. Lilly Thedora, Hyderabad
Dr. Yerranna Boggula, Medchal Malkajgiri
Mrs. B.Lily Agnes, Mancherial
Dr. S. John Sukumar, Nizamabad
Ms. U. Catherine Chelsea, Hyderabad

CONTACT DETAILS

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com

SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE

SCAN ME

Annual (Hard+Soft copy)
Students -150/-
Graduates - 300/-

For 3 Years (Hard+Soft copy)
Students - 450/-
Graduates - 900/-

Life (10 Years - Hard+Soft copy)
Students & Graduates - 2000/-

Overseas (10 Years - Soft copy)
Students & Graduates - 2000/-

Publication Trust Account

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - Pragathinagar
IFSC code - CNRB0004173

Kindly inform the office after depositing amount.
Ph. **8985482388**

Please furnish the following details

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

THEMES:

Feb - Love Unbound
Mar - Rise Above

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు.

విషయ సూచిక

నూతన ప్రారంభం	4
మీ ప్రశ్న - మన జవాబులు	7
ది జాయ్ ఆఫ్ మిస్సింగ్ అవుట్	8
వాగ్దానం నేరవేర్చిన దేవుడు	11
హైడ్రేషన్ హ్యాక్	12
యాక్టివ్ లిజనింగ్	15
డి.ఎల్. మూడీ	18
అమ్నేషియా	22
పడకముందే మేలుకో	24
రాజీపడని యోధుడు	26
గతం వీడు భవిష్యత్తు చూడు	29

విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ కె.ఫణి కుమార్ (89854 82388) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

ప్రతి నెల ప్రార్థనాంశాలు 20వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు editorvv2018@gmail.com **కు పంపించగలరు.**

– ఎడిటోరియల్ బోర్డ్

నూతన ప్రారంభం

మారిన కాలం... మారని నిరీక్షణ

ఒక్క క్షణం ఇలా ఊహించుకోండి: మీ జీవితానికి ఒక 'రీఫ్రెష్' బటన్ ఉంటే, ఈ సంవత్సరం మీరు దేనిని మళ్ళీ మొదటి నుండి ప్రారంభించాలని కోరుకుంటారు?

మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నప్పుడు, మనలో అటు ఆశ, ఇటు సంకోచం రెండూ ఉంటాయి. నిజమైన మార్పు వస్తుందనే ఆశ ఒకవైపు ఉంటే, గతంలో తీసుకున్న నిర్ణయాలు విఫలమయ్యాయనే నిరాశ మరోవైపు ఉంటుంది. నూతన సంవత్సరం మనకు ఎంతో ప్రత్యేకమైనది, ఎందుకంటే ఇది ఒక సరికొత్త ఆరంభాన్ని వాగ్దానం చేస్తుంది. కొత్త క్యాలెండర్, కొత్త ప్రణాళికలు... మన దేవుడు నూతన ప్రారంభాలకు కర్త అని మనకు గుర్తుచేస్తాయి.

అయితే, "నిజంగా ఈ సంవత్సరం భిన్నంగా ఉంటుందా?" అనే సందేహం మనల్ని వేధిస్తుంటుంది. మనలో ఎదగాలనే కోరిక లేకపోవడం వల్ల కాదు గానీ, ఆ మార్పును స్థిరంగా కొనసాగించలేకపోవడం వల్లే ఇలా జరుగుతుంటుంది. విశ్వాసంలో, అలవాట్లలో మరియు జీవితంలో నిజమైన అభివృద్ధిని సాధించడానికి అవసరమైన ఆచరణాత్మక దశలను ఇప్పుడు చూద్దాం.

1. స్థిరమైన ఆధ్యాత్మిక లక్ష్యాలు

చాలా నూతన సంవత్సర తీర్మానాలు కేవలం భావోద్వేగ క్షణాల్లోనే మొదలవుతాయి. ఒక శక్తివంతమైన ప్రసంగం విన్నప్పుడో, ఏదైనా క్యాంప్ లేదా ప్రేయర్ మీటింగ్ వెళ్ళి వచ్చిన తర్వాత, విద్యార్థులు "నేను ప్రతిరోజూ ప్రార్థన చేస్తాను" లేదా "బైబిల్ చదవడం అస్సలు మానను" అని నిర్ణయించుకుంటారు. ఈ తీర్మానాలు నిజాయితీతో కూడుకున్నవే అయినా, అవి తరచుగా అస్పష్టంగా ఉంటాయి. చదువుల ఒత్తిడిని బట్టి లేదా దినచర్యలో బాగా బిజీగా ఉండిపోయి లేదా అలసట పెరిగినప్పుడు ప్రేరణ బలహీనపడి ఆ ప్రారంభ ఉత్సాహం మెల్లగా తగ్గిపోతుంది.

కానీ, నిలిచి ఉండే ఆత్మీయ లక్ష్యాలు స్పష్టంగా ఉండాలి. అవి కేవలం మనం చేసే పనుల మీద

కాకుండా, మన ఐడెంటిటీ మీద ఆధారపడి ఉండాలి. అంటే, మనం ఏమి చేస్తున్నాం అనే దానికంటే, మనం ఎలాంటి వ్యక్తులుగా మారుతున్నాం అనేది ముఖ్యం.

బైబిల్లోని దానియేలును ఉదాహరణగా తీసుకుంటే, అతను అన్యదేశంలో ఉన్నప్పటికీ దేవుని సేవకునిగా జీవించాలని ఒక దృఢ నిశ్చయం చేసుకున్నాడు. తన ప్రాణానికి ముప్పు ఉన్నప్పటికీ, క్రమం తప్పకుండా ప్రార్థన జీవితాన్ని కొనసాగించాడు (దానియేలు 6:10). అతని నమ్మకత్వం ఏదో ఒక క్షణంలో వచ్చిన ప్రేరణ నుండి కాకుండా, అది అతని ఐడెంటిటీ నుండి వచ్చింది. అలాగే, విద్యార్థులు తమను తాము దేవుని బిడ్డలుగా గుర్తించినప్పుడు, వారి క్రియలు సహజంగానే దేవునికి అనుగుణంగా మారుతాయి.

2. చిన్న అడుగులతో ప్రారంభం

> ***"మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు, ఎక్కువలోను నమ్మకముగా ఉండును" (లూకా 16:10)***

గొప్ప ఆధ్యాత్మిక లక్ష్యాలు తరచుగా భక్తి లేకపోవడం వల్ల విఫలం కావు, కానీ అవి భరించ లేనంత భారంగా మారడం వల్ల విఫలమవుతాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి అకస్మాత్తుగా రోజుకు గంటసేపు బైబిల్ చదవాలని నిర్ణయించుకుంటే, క్లాసులు పెరిగినప్పుడు లేదా పరీక్షల సమయంలో అది కష్టమై ఆ అలవాటునే వదిలేయవచ్చు. ఇక్కడ సమస్య విశ్వాసం కాదు, ప్రారంభమే చాలా పెద్దదిగా ఉండటం.

యేసుప్రభువు ఇలా అన్నారు, "మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు, ఎక్కువ లోను నమ్మకముగా ఉండును" (లూకా 16:10). చిన్న చిన్న అడుగులు ఒత్తిడిని తగ్గించి, మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా ఒక్క అడుగుతో ప్రారంభమవు తుంది. ప్రతిరోజూ కేవలం ఐదు వచనాలు చదవడం లేదా రెండు నిమిషాలు ప్రార్థించడం చిన్నదిగా అనిపించవచ్చు, కానీ క్రమం తప్పకుండా పాటిస్తే ఈ చిన్న నియమాలు బలమైన ఆధ్యాత్మిక అలవాట్లను నిర్మిస్తాయి.

అస్పష్టమైన లక్ష్యాల కంటే, స్పష్టమైన, ఆచరణాత్మక మైన లక్ష్యాలు ఉండటం ముఖ్యం. "నేను బైబిల్ చదువుతాను" అనే కంటే, "ఉదయం నా క్వయిట్ టైంలో ఐదు వచనాలు వాక్యం చదివి, రెండు నిమిషాలు ప్రార్థిస్తాను" అని నిర్ణయించుకోవాలి. ఇలాంటి "ఏ లక్ష్యమైనా – స్పష్టంగా, కొలిచే విధంగా, సాధ్యమైనదిగా, మన జీవితానికి సంబం ధించినదిగా, కాలపరిమితితో ఉంటే అది సులభంగా సాధ్యమవుతుంది." ఈ స్మార్ట్ సూత్రం ఆధ్యాత్మిక విషయాలకే కాకుండా చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితం వంటి అన్ని అంశాలకు కూడా వర్తిస్తుంది.

3. దైనందిన జీవితంలో ఆధ్యాత్మిక క్రమశిక్షణ

ఆధ్యాత్మిక జీవితం అనేది కేవలం ఆదివారం చర్చికి లేదా ఫెలోషిప్ మీటింగ్‌లకు మాత్రమే పరిమితం కాకూడదు. మన దైనందిన జీవితంలోని ప్రతి క్షణంలోనూ దేవుడు మనతో ఉండాలని కోరు కుంటున్నాడు.

కీలకమైన విషయం ఏమిటంటే, ఆధ్యాత్మిక ఆచరణలను రోజువారీ పనులతో అనుసంధా నించడమే. ఉదాహరణకు, పుస్తకాలు తెరిచే ముందు చిన్న ప్రార్థన, ప్రయాణంలో వాక్యాన్ని వినడం, లేదా నిద్రపోయే ముందు దేవునికి కృతజ్ఞతలు చెప్పడం వంటి చిన్న అలవాట్లు విశ్వాసాన్ని పెంపొందిస్తూ జీవితంలో భాగమవుతాయి. ద్వితీ 6:6-7 ప్రకారం, మనం కూర్చున్నప్పుడు, నడిచేటప్పుడు, పండుకునేటప్పుడు దేవుని వాక్యాన్ని మాట్లాడుకోవాలి. ఇలా చేసినప్పుడు విశ్వాసం ఒక భారంలా కాకుండా, ఒక సహజమైన జీవనశైలిలా మారుతుంది.

4. పరిపూర్ణత కంటే పురోగతి ముఖ్యం

చాలామంది విద్యార్థులు ఒక్కరోజు క్వయిట్ టైం మిస్ అయితే, తమ నిర్ణయం మొత్తం విఫల మైందని భావిస్తారు. కానీ ఆధ్యాత్మిక ఎదుగుదల అనేది పరిపూర్ణంగా ఉండటం గురించి కాదు, పడినా మళ్ళీ లేచి నిలబడటం గురించి ఉంటుంది.

యేసుక్రీస్తు అత్యంత క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు, పేతురు ఆయనను మూడుసార్లు ఎరుగనన్నప్పటికీ, పశ్చాత్తాపంతో తిరిగి లేవడంతో ఆ తర్వాత ఆదిమ సంఘానికి గొప్ప నాయకు డయ్యాడు. "నీతిమంతుడు ఏడుమార్లు పడినను తిరిగి లేచును" (సామెతలు 24:16). దేవుడు

లోపాలు లేని ప్రవర్తన కంటే, మన హృదయంలోని నమ్మకత్వాన్ని విలువైనదిగా చూస్తాడు. ఒక్క రోజు విఫలమైనా నిరాశ చెందకుండా, మరుసటి రోజు మళ్ళీ తిరిగి కొనసాగించే విధంగా ఉండాలి.

ఒత్తిడిలో ఉన్న రోజున మీరు చేసే చిన్న ప్రార్థన కూడా దేవునికి ముఖ్యమే. వైఫల్యాలు అనేవి ఓటమికి నిదర్శనం కాదు, అవి నేర్చుకునే ప్రక్రియలో ఒక భాగం అని విద్యార్థులు అర్థం చేసుకున్నప్పుడు, వారు గొప్ప మనోధైర్యాన్ని, నిరీక్షణను పెంచు కుంటారు. "పరిపూర్ణత కంటే పురోగతిని కోరు కోవడం ద్వారా స్వేచ్ఛ, ఆనందం మరియు స్థిరమైన ఆధ్యాత్మిక ఎదుగుదల కలుగుతాయి."

5. అలసటను తెలివిగా నివారించండి

జీవితం నిరంతరం మారుతూ ఉంటుంది, కాబట్టి మన లక్ష్యాలు పరిస్థితులకు తగ్గట్టుగా మలుచుకునేలా ఉండాలి. పరీక్షల ఒత్తిడి, కుటుంబ సమస్యలు లేదా మానసిక ఆందోళనల వల్ల ఒక్కోసారి మనం ఆధ్యాత్మికంగా వెనుకబడినట్లు అనిపించవచ్చు. అయితే, అలా అనిపించడం విఫలమవ్వడం కాదు, అది కేవలం మనిషిగా మన సహజ లక్షణం. "ప్రతి దానికి సమయము కలదు" అని బైబిల్ మనకు గుర్తుచేస్తోంది (ప్రసంగి 3:1). కాబట్టి, మన లక్ష్యాలను పూర్తిగా వదిలేయకుండా, వివేకంతో వాటిని రీ-షెడ్యూల్ చేసుకోవడమే అసలైన జ్ఞానం.

ఎప్పటికప్పుడు మనల్ని మనం పరీక్షించుకోవడం వల్ల మన పరిమితులను, బాధ్యతలను అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా ఉదయం 8 గంటలకు నిద్రలేచే విద్యార్థి అకస్మాత్తుగా 6 గంటలకు లేవాలని నిర్ణయించుకుంటే, అది విఫలమయ్యే అవకాశం ఉంది. దానికి బదులు మెల్లగా... మొదటి నెల 7:30కు, తర్వాత 7:00కు, అలా క్రమంగా 6:00 గంటలకు నిద్ర లేవడం సరైన పద్ధతి. చిన్న చిన్న విజయాలే మనలో ఉత్సాహాన్ని నింపి శాశ్వత మార్పును తెస్తాయి.

అలాగే, పరీక్షల సమయంలో ఉదయం 6:00 గంటలకే లేచి క్వయిట్ టైం చేయడం కష్టమైతే, దాన్ని పూర్తిగా మానేయాల్సిన పనిలేదు. దానికి బదులుగా సమయాన్ని 7:00 గంటలకు మార్చుకోవచ్చు. ఇక్కడ కఠినమైన రూల్స్ కంటే నిలకడగా ఉండటమే ముఖ్యం.

గుర్తుంచుకోండి, దేవునితో గడిపే సమయం అర్థవంతంగా ఉండటానికి అది సుదీర్ఘంగా ఉండాల్సిన అవసరం లేదు. మనసు పెట్టి చేసే ఐదు నిమిషాల ప్రార్థన కూడా మనల్ని దేవునికి దగ్గర చేస్తుంది. సమయం తక్కువగా ఉన్నప్పుడు బైబిల్ చదవడానికి బదులుగా ఆడియో బైబిల్ వినడం వంటి ఆల్టర్నేటివ్స్ ప్రయత్నించవచ్చు. అల సిపోయిన తన శిష్యులను స్వయంగా యేసుక్రీస్తే విశ్రాంతి తీసుకోమని కోరారు (మార్కు 6:31). కాబట్టి, అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడం ఆధ్యాత్మిక వైఫల్యం కాదు, అది ఒక హెల్తీ లైఫ్ స్టైల్‌లో భాగం.

పరిస్థితులకు తగ్గట్టుగా లక్ష్యాలను మార్చు కోవడం అనేది పరిపక్వతకు నిదర్శనం. చదువు, కెరీర్, రిలేషన్ షిప్స్ వంటివన్నీ ముఖ్యమే, కానీ మన ప్రయాణంలో దేవునికే ప్రథమ స్థానం ఉండాలి. మన ప్రాధాన్యతలను సరైన క్రమంలో ఉంచుకున్నప్పుడు, జీవితంలోని మిగతా అంశాలన్నీ వాటంతటవే క్రమబద్ధం చేయబడతాయి.

ముగింపు

నిజమైన మార్పు అంటే సంవత్సరానికి ఒకసారి తీసుకునే నిర్ణయాలు కాదు; అది ప్రతి రోజూ దేవునితో నమ్మకంగా నడిచే నడక. విద్యార్థులు మరీ కష్టమైన లక్ష్యాలు పెట్టుకోకుండా, సాధ్యమయ్యే చిన్న చిన్న అడుగులు వేయాలి. పర్ఫెక్షన్ కోసం పాకులాడటం కంటే, ప్రతి రోజూ కొంత పురోగతి సాధించడంపై దృష్టి పెట్టాలి.

జీవితంలో ఒత్తిడి, ఊహించని సవాళ్లు ఎదురైనప్పుడు దేవుని కృప మనకు తోడుగా ఉంటుంది. మనం ఆయనకు మొదటి స్థానం ఇచ్చినప్పుడు, ప్రతి సమస్యను ఎదుర్కోవడానికి కావలసిన బలం మరియు బ్యాలెన్స్ ఆయన అనుగ్రహిస్తారు. రూపాంతరం చెందిన జీవితం అనేది ఒక్క రోజులో వచ్చేది కాదు; అది ప్రతిరోజూ

మనం వేసే చిన్న చిన్న విశ్వాసపు అడుగుల ద్వారానే సాధ్యమవుతుంది.

రెఫరెన్సెస్

1. ద హోలీ బైబిల్ (NIV/ESV)
2. అటామిక్ హాబిట్స్: ఎన్ ఈజీ అండ్ ప్రూవెన్ వే టు బిల్డ్ గుడ్ హాబిట్స్ అండ్ బ్రేక్ బాడ్ వన్స్, జేమ్స్ క్లియర్, అవెరీ పబ్లిషింగ్, 2018
3. మైండ్‌సెట్: ది న్యూ సైకాలజీ ఆఫ్ సక్సెస్, కారోల్ ఎస్. డ్వెక్, ర్యాండమ్ హౌస్, 2006
4. సెలబ్రేషన్ ఆఫ్ డిసిప్లిన్, రిచర్డ్ జె. ఫోస్టర్, హార్పర్ వన్, 2018
5. క్రాఫ్ట్ యువర్ ఇయర్: ఎ ప్రాక్టికల్ గైడ్ టు సెట్టింగ్ అండ్ అచీవింగ్ యువర్ ఇయర్లీ గోల్స్
6. ది కామన్ రూల్: హాబిట్స్ ఆఫ్ పర్పస్ ఫర్ ఎన్ ఏజ్ ఆఫ్ డిస్ట్రాక్షన్, జస్టిన్ విట్మెల్ ఎర్లీ, 2016

– **పున్నారావు వేముల,** నర్సాపూర్ (మెదక్)

++++++++

నూతన శీర్షిక

మీ ప్రశ్న – మన జవాబులు

జనవరి నెల ప్రశ్న:

క్యాంపుల్లో 2/2 టైంలో మీరు ఏమేమి మాట్లాడతారు?

జవాబు

యూనియన్ ఆఫ్ ఇవాంజలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా (యుఇయస్ఐ) పరిచర్యలో భాగంగా నిర్వహించే క్యాంపుల్లో 2/2 సెషన్స్ (వ్యక్తిగత సహవాసం) అత్యంత కీలకం. ఈ సమయంలో విద్యార్థులతో ఎలా సంభాషించాలి, ఏ అంశాలను చర్చించాలనే దానిపై సమాచారం ఇక్కడ ఇవ్వబడింది.

2/2 సమయంలో చర్చించాల్సిన సాధారణ అంశాలు

క్యాంపు జరుగుతున్న రోజుల్లో సాయంకాలం వేళ సీనియర్ విద్యార్థులు లేదా గ్రాడ్యుయేట్స్, తోటి విద్యార్థులతో 2/2 సహవాసం కలిగియుంటారు.

* మొదట పరస్పరం పరిచయం చేసుకుంటూ, స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పాలి.
* విద్యార్థుల చదువు, కుటుంబ నేపథ్యం, వారి ఆర్థిక పరిస్థితులు మరియు తల్లిదండ్రుల జీవన విధానం గురించి అడిగి తెలుసుకోవాలి.
* క్యాంపుకు రావడం ఇది ఎన్నోవ సారి? ఇక్కడి వసతులు, భోజనం మరియు నిర్వహణపై వారి అభిప్రాయాలను అడగాలి.
* వారు చదువుతున్న కళాశాల (గవర్నమెంట్ లేదా ప్రైవేట్) మరియు కోర్సును బట్టి అవసరమైన కెరీర్ సలహాలు అందించాలి.
* ఆ రోజు క్యాంపులో జరిగిన సెషన్స్ ద్వారా వారు ఏమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకోవాలి.

క్యాంప్ రకాన్ని బట్టి సంభాషణలు

యుఇయస్ఐ పరిచర్యలో మూడు రకాల క్యాంపులు ఉంటాయి. ఒక్కో క్యాంపు ఉద్దేశాన్ని బట్టి 2/2 సంభాషణ మారుతుంది:

1. ఇవాంజలిస్టిక్ క్యాంపు (ఇసి)

ఇది రక్షణ అనుభవం లేని క్రైస్తవ కుటుంబ నేపథ్యం గల విద్యార్థులు మరియు ఇతర మతస్థుల కోసం ఉద్దేశించినది.

* విద్యార్థుల మనసులోని సందేహాలకు, ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పాలి.
* వారి సంభాషణను బట్టి వారి ఆధ్యాత్మిక స్థితిని గమనిస్తూ, దేవుని గొప్పతనాన్ని, రక్షణ ప్రాముఖ్య తను వివరించాలి.

2. డిసైపుల్‌షిప్ ట్రైనింగ్ (డిటి) క్యాంపు

రక్షణ పొందిన విద్యార్థుల కోసం నిర్వహించే ట్రైనింగ్ క్యాంప్ ఇది.

* బైబిల్ సిద్ధాంతాలను వివరించడం మరియు నిజమైన శిష్యుని లక్షణాలను చర్చించడం ముఖ్యం.
* యేసుక్రీస్తు శిష్యులుగా సమాజంలో మన బాధ్యత ఏమిటో, లోకంలో దేవుని కొరకు ఎలా జీవించాలో గైడెన్స్ ఇవ్వాలి.

3. లీడర్‌షిప్ ట్రైనింగ్ (యల్‌టి) క్యాంపు

ఇది ఇప్పటికే డిటి క్యాంప్‌కు అటెండ్ అయ్యి నాయకత్వ లక్షణాలు గల విద్యార్థుల కోసం నిర్వహించే ట్రైనింగ్ క్యాంప్ ఇది.

* ఒక క్రిస్టియన్ లీడర్‌గా కళాశాలల్లో, రేపు ఉద్యోగంలో ఎలా సాక్ష్యంగా ఉండాలో చర్చించాలి.
* ఉద్యోగం, వివాహం వంటి కీలక విషయాల్లో దేవుని చిత్తాన్ని ఎలా గుర్తించాలో సలహాలు అందించాలి.

ప్రార్థన

సంభాషణ ముగిసే ముందు, ఆ రోజు క్యాంప్‌లో నేర్చుకున్న విషయాల పట్ల స్తుతిస్తూ, విద్యార్థుల వ్యక్తిగత అవసరాల నిమిత్తం భారంతో ప్రార్థన చేసి 2/2 సెషన్‌ను ముగించాలి.

– **కె. బర్నబాస్ (భద్రయ్య),** టీచర్, మంచిర్యాల

ఫిబ్రవరి నెల ప్రశ్న

బైబిల్ పఠనం: క్వాలిటీ (నాణ్యత) వర్సెస్ క్వాంటిటీ (పరిమాణం)?

మీ సమాధానం ***జనవరి 10వ*** తేదీలోగా పంపించగలరు.

ది జాయ్ ఆఫ్ మిస్సింగ్ అవుట్ (జోమో – JOMO)

ఈ రోజుల్లో సోషల్ మీడియా పుణ్యమా అని ప్రతి ఒక్కరి జీవితం ఒక తెరిచిన పుస్తకంలా, అందరికీ కనిపిస్తుంది. ఇలాంటి ప్రపంచంలో, మనం ఏదో కోల్పోతున్నాం అనిపించడం చాలా సహజం. అది ఒక పండుగ కావచ్చు, ఒక ట్రెండ్ కావచ్చు, ఒక సరదా క్షణం కావచ్చు, లేదా మనకంటే ఇతరుల జీవితం చాలా బాగుందనే భావన కావచ్చు.

ఇతరులు అనుభవిస్తున్నవి మనకు లేవే అనే ఈ ఆందోళననే **"ఫోమో"** (FOMO - Fear of Missing Out) అంటారు. అయితే, ఈ ఒత్తిడికి బదులుగా మనకు శాంతిని ఇచ్చే ఒక గొప్ప ప్రత్యామ్నాయం ఉంది. అదే దేవుని యందలి విశ్వాసంపై ఆధారపడిన ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయం "జోమో" (JOMO - The Joy of Missing Out).

అంటే, లేనిదాని గురించి బాధపడటం మానేసి, మనకున్న దానిలో ఆనందాన్ని వెతుక్కోవడం. దీనర్థం జీవితానికి దూరంగా పారిపోవడం కాదు; దేవుడు మనకిచ్చిన జీవితాన్ని సంతోషంగా స్వీకరించడం.

1. పోల్చుకోవడం అనే జబ్బు మరియు 'ఫోమో'

ఫోమో అనేది ఒక మానసికమైన భావన. సోషల్ మీడియా వల్ల ఇది ఈ మధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. ఇది ఈ కాలపు సమస్యలా అనిపించినా, నిజానికి ఇది మనిషి హృదయంలో ఎప్పటి నుండో ఉన్న ఒక పోరాటం. ఇప్పుడు అది డిజిటల్ సాధనాల ద్వారా బయటపడుతోంది.

> *"ఈ సమస్యకు మూలం సంఘటనలు కాదు, పోల్చుకోవడం మాత్రమే."*

అందరితో కలిసుండాలి, ఎక్కడ వెనుకబడి పోతామో అనే భయమే దీనికి ముఖ్య కారణం. మనల్ని మనం ఇతరులతో పోల్చుకోవడం, అభద్రతా భావం, ఒంటరిగా మిగిలిపోతామేమోననే భయం దీని లక్షణాలని మానసిక నిపుణులు చెబుతున్నారు.

టెక్నాలజీ పెరిగిపోవడం వల్ల, ముఖ్యంగా నేటి యువతలో (Gen Z) ఈ ప్రభావం చాలా బలంగా ఉంది. 90 శాతానికి పైగా యువత రోజూ సోషల్ మీడియా వాడుతున్నారు. అందులో చాలామంది రోజుకు నాలుగు గంటలకు పైగా సమయాన్ని దానికే కేటాయిస్తున్నారు. వీరిలో దాదాపు 70-80 మంది తరచుగా ఈ ఫోమో సమస్యను ఎదుర్కొంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

మీ మెదడు మీకు ఇలా చెప్పడం మొదలు పెడుతుంది:

* "నేను జీవితంలో వెనుకబడిపోతున్నాను"
* "అందరూ నాకంటే సంతోషంగాఉన్నారు"
* "నా జీవితంలో ఎలాంటి ఉత్సాహం లేదు."

ఫోమో అంటే కేవలం మనం మంచి పనులు చేయడం లేదని బాధపడటం మాత్రమే కాదు. ఇతరులు ఇప్పుడు అనుభవిస్తున్న ఏదో గొప్పదాన్ని మనం కోల్పోతున్నాం అనే బలమైన భావన అది. భావోద్వేగ పరంగా చూస్తే, ఇది మనలో ఆందోళనను, అభద్రతను పెంచుతుంది. మన జీవితం "తక్కువ" అనే భావనను కలిగిస్తుంది.

మానసికంగా, మన మెదడు ఎప్పుడూ ఇతరుల మెప్పును కోరుకుంటుంది. దాంతో పోల్చుకోవడం ఒక అలవాటుగా మారుతుంది. మనం ఎంత ఎక్కువగా పోల్చుకుంటే, మన జీవితం అంత వెలితిగా అనిపిస్తుంది.

> ***"... వారు తమలోనే యొకరిని బట్టి యొకరు ఎన్నిక చేసుకొని, యొకరితో నొకరు సరిచూచుకొను చున్నందున గ్రహింపు లేకయున్నారు" (2 కొరింథీ 10:12)***

2. సంతృప్తి కలిగి వర్తమానంలో జీవించడం

ఈ రోజుల్లో సంతృప్తిగా ఉండటం చాలా కష్టంగా మారింది. ఎందుకంటే, సోషల్ మీడియాలో అందరూ తమ జీవితంలోని "అందమైన క్షణాలను" మాత్రమే చూపిస్తారు. ఎప్పుడూ బిజీగా ఉండటం, అందరి దృష్టిలో పడటమే గొప్ప అని ఈ లోకం చెబుతుంది. నిశ్శబ్దంగా, విశ్వాసంతో బ్రతికే జీవితం ఆన్‌లైన్‌లో చూడటానికి అంత ఆసక్తిగా అనిపించకపోవచ్చు. కానీ వాక్యం మనకు ఇలా గుర్తుచేస్తోంది:

"సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభ సాధన" (1 తిమోతి 6:6).

ఈ ఫోమోను జయించాలంటే, ప్రస్తుతం మీరున్న స్థితిని ప్రేమించడం నేర్చుకోవాలి. సంతృప్తి అంటే మీ జీవితం లోపాలు లేకుండా పరిపూర్ణంగా ఉందని కాదు. దానర్థం, దేవుడు మిమ్మల్ని ఉంచిన ఈ సమయం విలువైనదని గుర్తించడం.

ప్రస్తుత క్షణంలో జీవించడం వల్ల నిజమైన ఆనందం కలుగుతుంది. ఇతరులు ఏం చేస్తున్నారు అనేదాన్ని బట్టి ఆనందం రాదు; మీరు ఎలా జీవిస్తున్నారు అనేదాన్ని బట్టి వస్తుంది. మీరు కాస్త ఆగి, మీకున్న ఆశీర్వాదాలను, మీ ఎదుగుదలను, మీ సంబంధాలను, మీ జీవిత గమనాన్ని గమనించినప్పుడు ఈ ఫోమో తన బలాన్ని కోల్పోతుంది.

3. మనుషుల మెప్పు నుండి అంతరంగ శాంతి వైపు

సోషల్ మీడియా 'లైక్స్', కామెంట్స్, ఇతరుల శ్రద్ధ మీద ఆధారపడి ఉంటుంది. మనకు వచ్చే ప్రతి "లైక్" మెదడులో డోపమైన్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది. ఇది మనకు తాత్కాలిక సంతోషాన్ని ఇస్తుంది. కాలక్రమేణా, ఇది ఒక వ్యసనంలా మారుతుంది.

కానీ విశ్వాసం దీనికి భిన్నంగా పనిచేస్తుంది. అది శాంతి, మన గుర్తింపు, దేవుని ఉద్దేశాల మీద ఆధారపడి ఉంటుంది. మీ విలువ మనుషుల నుండి కాకుండా దేవుని నుండి వస్తోందని మీరు గ్రహించినప్పుడు, డిజిటల్ ప్రపంచంతో పోటీ పడాల్సిన అవసరం మీకు ఉండదు.

> ***గుర్తుంచుకోండి:***
> ప్రజలు సాధారణంగా మన జీవితంలోని మంచి ఉత్తమ క్షణాలను మాత్రమే చూస్తారు. కానీ దేవుడు మన పూర్తి వాస్తవికతను చూస్తాడు. మన పోరాటాలు, మన ఉద్దేశాలు, మన ఎదుగుదల అన్నీ ఆయనకు తెలుసు.

"ప్రజలు నా జీవితాన్ని ఇష్టపడుతున్నారా?" అని అడగడం మానేసి, "నేను జీవిస్తున్న విధానం నా హృదయానికి శాంతిని, దేవునికి మహిమను ఇస్తోందా?" అని ప్రశ్నించుకోవాలి.

ఎప్పుడైతే మీరు బయటి వారి మెప్పు కోసం కాకుండా అంతరంగ శాంతి కోసం ఆలోచిస్తారో, అప్పుడు మీరు మానసికంగా, ఆత్మీయంగా బలపడతారు.

4. డిజిటల్ అలజడి వీడి బంధాలను పెంచుకోవడం

ఫోమోని జయించాలంటే కేవలం ఆలోచన మారితే సరిపోదు, అలవాట్లు కూడా మారాలి. ఇక్కడ కొన్ని సులభమైన మార్గాలు ఉన్నాయి:

* **సోషల్ మీడియాకు సమయం కేటాయించండి:** రోజుకు 1-2 గంటలు తక్కువగా ఫోన్ చూడటం వల్ల మీ మానసిక స్థితిలో గొప్ప మార్పు వస్తుంది.
* **"నో ఫోన్ అవర్స్" ను నిర్ణయించుకోండి:** భోజన సమయంలో, ప్రార్థన చేసుకునే టప్పుడు, చదువుకునేటప్పుడు లేదా నిద్ర పోయే ముందు ఫోన్‌ను పక్కన పెట్టండి.
* **నోటిఫికేషన్లు ఆపేయండి:** మీ ఏకాగ్రతను దెబ్బతీసే అనవసరమైన అలర్ట్‌లను ఆఫ్ చేయండి.
* **నిజమైన స్నేహితులతో గడపండి:** కేవలం ఆన్‌లైన్ చాటింగ్ కాకుండా, ప్రత్యక్షంగా మనుషులతో మాట్లాడండి.
* **మీకు ఉత్సాహాన్నిచ్చే పనులు చేయండి:** చదవడం, ఆటలు ఆడటం, పాటలు పాడటం, రాసుకోవడం లేదా ఇతరులకు సహాయం చేయడం వంటివి చేయండి.

మీ డిజిటల్ ప్రపంచంలో ఎంత తక్కువ గోల (Noise) ఉంటే, మీ నిజ జీవితంలో అంత స్పష్టత ఉంటుంది.

5. జోమోతో దైవిక ఆనందం

మనం బైబిల్లోని ఫిలిప్పీ పత్రికను చూస్తే, దానిని తరచుగా "ఆనంద పత్రిక" అని పిలుస్తారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, పౌలు దానిని జైలులో ఉండి వ్రాశాడు. మన పరిస్థితులు మన ఆనందాన్ని నిర్ణయించలేవు అనే గొప్ప సత్యానికి ఇది నిదర్శనం. అదే పత్రికలో అపొస్తలుడైన పౌలు ఇలా వ్రాశాడు:

> **"నేను ఏ స్థితిలో ఉన్నానో ఆ స్థితిలో సంతృప్తి కలిగి యుండ నేర్చుకొనియున్నాను" (ఫిలిప్పీ 4:11).**

ఇక్కడ పౌలు "నేర్చుకొనియున్నాను" అని అనడం గమనించండి. సంతృప్తి అనేది దానంతట అదే రాదు; అది మనం అలవాటు చేసుకోవాలి.

అదే విధంగా, జోమో (కోల్పోవడంలో ఉన్న ఆనందం) కూడా యాదృచ్ఛికంగా రాదు; అది మనం ఉద్దేశపూర్వకంగా చేసే ఎంపిక.

* ప్రజాదరణ కంటే దేవుని ఉద్దేశానికి ప్రాముఖ్యత ఇవ్వడం.
* ఒత్తిడి కంటే దేవుని సన్నిధికి ప్రాముఖ్యత ఇవ్వడం.
* భయం కంటే విశ్వాసానికి ప్రాముఖ్యత ఇవ్వడం.

'జోమో' ని పాటించడం వల్ల ఒత్తిడి మరియు ఆందోళన 23% తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. పోల్చుకోవడం వల్ల కాదు గానీ, సంతృప్తి వల్లనే శాంతి కలుగుతుందని బైబిల్ చెబుతున్న సత్యాన్ని 'జోమో' బలపరుస్తోంది.

* "నేను సంతోషంగా ఉండాలంటే ప్రతిచోటా ఉండాల్సిన అవసరం లేదు."
* "ప్రస్తుతం నాకున్న ఈ క్షణాన్ని నేను ఆనందించగలను."
* "నిరంతర బిజీ జీవితం కంటే విశ్రాంతి, శాంతి మరియు యథార్థత చాలా ముఖ్యం."

మీరు 'జోమో' ని స్వీకరించినప్పుడు, మీరు కోరుకుంటున్న జీవితం కోసం పరుగెత్తడం మానేసి, దేవుడు మీ ముందు ఉంచిన జీవితాన్ని జీవించడం ప్రారంభిస్తారు. అది ఉద్దేశంతో, ఆనందంతో, అర్థవంతంగా నిండిన జీవితం.

ముగింపు

లోకం ఏమనుకున్నా సరే, దేవుని ప్రణాళిక మనకు సరిపోతుందని నమ్మడమే 'జోమో'. మీరు దీనిని ఎంచుకున్నప్పుడు, మీరు దేవుని సన్నిధిని, శాంతిని, విశ్వాసాన్ని ఎంచుకున్నవారవుతారు. నిజంగా జీవించాల్సిన జీవితం ఇదే.

మీరు ఎవరికంటే వెనుకబడి లేరు
దేవుడు మిమ్మల్ని మర్చిపోలేదు
మీరు ఏదీ కోల్పోవడం లేదు
దేవుడు తన కార్యాలను మీలో
జరిగించడానికి
మీరు ప్రస్తుతం ఉన్న స్థితి సరైనదే
అది గుర్తుంచుకోవాలి.

– మార్టిన్ లూథర్ పిరంగి,
రాజేంద్రనగర్ జోన్, హైదరాబాద్

వాగ్దానం నేరవేర్చిన దేవుడు

నా పేరు రజిత. మాది రూప్ల నాయక్ తండా, మానాల గ్రామం, రుద్రంగి మండలం, సిరిసిల్ల జిల్లా. నేను హిందూ కుటుంబంలో జన్మించాను. మా ఇంట్లో మరియు మా ఊరిలో విగ్రహారాధన ఎక్కువగా చేసేవారు. అందుకే నేను నా ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు విగ్రహారాధన చేస్తూనే ఉన్నాను. నేను బి.టెక్ చదవడానికి జేఎన్టీయూహెచ్‌కు వచ్చాను.

అక్కడ నాకు కొంతమంది సీనియర్స్ పరిచయ మయ్యారు. వారు దేవుని గురించి చెప్పేవారు మరియు ప్రతిరోజు నన్ను ఫ్యామిలీ ప్రేయర్స్‌కు తీసుకెళ్లే వాళ్ళు. వారు చేస్తున్న ప్రేయర్ మరియు వారు నా పట్ల చూపించిన ప్రేమ నన్ను ఎంతో ఆశ్చర్యపరిచాయి. ఒకరోజు వారు నన్ను ఇ-క్యాంపుకు తీసుకెళ్లారు. ఆ క్యాంపులో 'దేవుడు ఎవరు' అనే విషయం నాకు స్పష్టంగా అర్థమైంది. అదే క్యాంపులో నేను రక్షించబడ్డాను. అది 2015వ సంవత్సరం.

నేను రక్షించబడిన సమయంలో మా ఇంట్లో వాళ్ళు, బంధువులు మరియు ఊరి వాళ్ళు నన్ను తీవ్రంగా తిట్టారు. అంతేకాక, చాలా ఒత్తిడి పెట్టారు. మా అమ్మ కూడా నన్ను బ్లాక్ మెయిల్ చేయడం జరిగింది. ఆ సమయంలో నేను మనసులోనే దేవునికి ప్రార్థన చేసేదానిని. అలా దేవుడు నాకు అండగా నిలిచి సహాయం చేశాడు.

"నీ దేవుడే నీకు సహాయం చేశాడు"

2019లో నేను బి.టెక్ పూర్తి చేశాను. ఆ తర్వాత ఇంట్లో వాళ్ళు నా పెళ్లి కోసం సంబంధాలు చూడటం ప్రారంభించారు. అప్పుడు నేను, "నాకు జాబ్ వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటాను" అని చెప్పాను. దానికి వారు "నీకు జాబ్ రాదు" అని చెప్పి, నన్ను పెళ్లి చేసుకోవాలని మరింత బల వంతం చేశారు. ఆ క్లిష్ట సమయంలో నేను పూర్తిగా దేవుని మీదనే ఆధారపడ్డాను. అప్పుడు దేవుడు జాబ్ విషయంలో నాతో మాట్లాడి, "నేను నీకు జాబ్ ఇస్తాను" అని వాగ్దానం చేశాడు (మత్తయి 7:9-11). ఆ సమయంలో సనత్‌నగర్ ఇఙియఫ్ కూడా నాకు ఎంతో సపోర్ట్ చేసింది.

దేవుని మహా కృపను బట్టి నేను గ్రూప్-2, గ్రూప్-3 మరియు గ్రూప్-4 కు సెలెక్ట్ అయ్యాను. ప్రస్తుతం మా ఇంట్లో వాళ్ళు మరియు బంధువులు అందరూ, "నీ దేవుడే నీకు సహాయం చేశాడు" అని అంటున్నారు.

ఆ తర్వాత, నా మ్యారేజ్ కోసం ప్రార్థన చేస్తున్నప్పుడు, దేవుడు తన చిత్తంలో మ్యారేజీ జరిగించారు. అందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను.

ప్రస్తుతం నేను గ్రూప్-2లో మండల పంచాయితీ రాజ్ ఆఫీసర్‌గా సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాను.

హైడ్రేషన్ హ్యాక్
Hydration Hack

జీవరాశి మనుగడకు నీరు అత్యంత కీలకం. మానవ శరీరంలో దాదాపు 60% నీరు ఉంటుంది, అదే మన మెదడులో సుమారు 73% నీరు ఉంటుంది. అయితే, మన శరీరం ఈ నీటిని నిరంతరం నిల్వ ఉంచుకోదు. మూత్ర విసర్జన, చెమట, శ్వాసక్రియ, జీర్ణక్రియ వంటి ప్రకియల ద్వారా శరీరం నిరంతరం నీటిని కోల్పోతుంది. దీనిని 'డైలీ వాటర్ టర్నోవర్' (రోజువారీ నీటి వినియోగం) అంటారు.

సాధారణంగా శారీరక శ్రమ తక్కువగా ఉన్నా, ఒక సాధారణ మనిషి రోజుకు 2 నుండి 3 లీటర్ల నీటిని కోల్పోతాడు. అందుకే, శరీరంలో 'హైడ్రేషన్' సమతుల్యలను కాపాడుకోవడానికి తగినంత నీరు తీసుకోవాలని డాకర్లు పదేపదే సూచిస్తుంటారు.

1. డీహైడ్రేషన్: హెచ్చరిక సంకేతాలు

శరీరానికి అవసరమైన నీటిని తిరిగి అందించనప్పుడు 'డీహైడ్రేషన్' ఏర్పడుతుంది. శరీరంలోని నీటి నిల్వలో కేవలం 1-2% తగ్గినా అది తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనివల్ల శక్తి క్షీణించడం, మూడ్ మారిపోవడం మరియు జ్ఞాపకశక్తి మందగించడం వంటివి జరుగుతాయి. రక్త పరిమాణం తగ్గే కొద్దీ మెదడుకు అందే ఆక్సిజన్ సరఫరా తగ్గి, మానసిక అలసట పెరుగుతుంది. తీవ్రత పెరిగి 10% నీరు తగ్గితే మతిస్థిమితం తప్పుతుంది, 15% తగ్గిపోతే అది ప్రాణాపాయానికి దారితీస్తుంది. కాబట్టి, నీరు తాగడం అనేది కేవలం ఒక అలవాటు కాదు, అది మనుగడకు ప్రాథమిక అవసరం.

2. దప్పిక తీరని తపన

మానవుడు అనుభవించే అత్యంత కఠినమైన శారీరక వేదనలలో 'దాహం' ఒకటి. డీహైడ్రేషన్‌తో మరణిస్తున్న వ్యక్తి ముందు కోట్లాది రూపాయల సంపదను, టన్నుల కొద్దీ బంగారాన్ని ఉంచి, మరోవైపు ఒక గ్లాసు నీరు ఉంచితే... ఆ క్షణంలో అతనికి సంపద వ్యర్థంగా అనిపిస్తుంది. ఏమాత్రం సంకోచించకుండా అతను నీటి కోసమే చేయి చాచుతాడు.

చరిత్రను పరిశీలిస్తే, రెండో ప్రపంచ యుద్ధంలో

నౌకలు మునిగిపోయి సముద్రంలో చిక్కుకున్న వారు, స్వచ్ఛమైన నీరు లేక కేవలం పదకొండు రోజులు మాత్రమే ప్రాణాలతో ఉండగలిగారు. లేఖనాలలో కూడా ఈ వేదన ప్రస్తావించబడింది.

ధనవంతుడు నరక యాతన అనుభవిస్తూ, తన నాలుకను చల్లబరచుకోవడానికి కేవలం ఒక్క బొట్టు నీటి కోసం వేడుకున్న వృత్తాంతం *(లూకా 16:24)* దాహం యొక్క తీవ్రతను తెలియజేస్తుంది.

శారీరక దాహమే ఇంత భరించలేనంతగా ఉంటే, ఆత్మ యొక్క తృష్ణ ఇంకెంత లోతుగా ఉంటుందో ఆలోచించాల్సిందే.

3. నీటిని తీసుకోవడం: ఒక కృతజ్ఞతా భావం

శారీరక దాహాన్ని తీర్చుకోవడం వెనుక ఒక లోతైన ఆధ్యాత్మిక అర్థం దాగి ఉంది. సాధారణంగా చాలామంది భౌతిక శరీరానికి, ఆధ్యాత్మిక జీవితానికి సంబంధం లేదని భావిస్తారు. కానీ బైబిల్ లేఖనాలు భిన్నమైన దృక్పథాన్ని అందిస్తాయి. మానవుడు దేవుని స్వరూపంలో సృష్టించబడ్డాడని, మన శరీరం పరిశుద్ధాత్మ నివసించే ఆలయమని వాక్యం చెబుతోంది (1 కొరింథీ 6:19-20). మన దేహం మన సొత్తు కాదు; అది దేవుడు మనకిచ్చింది, కాబట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనే గృహనిర్వాహకత్వం అప్పగింపబడింది.

మనం తగినంత నీరు త్రాగినప్పుడు, పౌష్టికాహారం తీసుకున్నప్పుడు మరియు మన ఆరోగ్యాన్ని కాపాడుకున్నప్పుడు, దేవుడు ఇచ్చిన ఈ ఆలయాన్ని మనం గౌరవిస్తున్నట్లే అవుతుంది. అపొస్తలుడైన పౌలు చెప్పినట్లుగా:

"కాబట్టి మీరు భోజనము చేసినను పానము చేసినను మరి ఏమి చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి" *(1 కొరింథీ 10:31).*

నీరు త్రాగడం వంటి సాధారణ పని కూడా కృతజ్ఞతను, క్రమశిక్షణను మరియు దైవభక్తిని ప్రతిబింబిస్తాయి.

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం వల్ల స్పష్టంగా ఆలోచించగలం, ఉత్సాహంగా ఉండగలం మరియు మన బాధ్యతలను చక్కగా నిర్వహించగలం. అదే సమయంలో, శారీరక పోషణ మాత్రమే అంతిమం కాదని లేఖనాలు గుర్తుచేస్తున్నాయి. "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలనను జీవించును" అని యేసు చెప్పారు (మత్తయి 4:4). మనం చేసే 'ఉపవాసం' దీనికి ఒక మంచి ఉదాహరణ. ఉపవాసం శరీర విలువను తక్కువ చేయదు; శారీరక బలం ముఖ్యమే అయినప్పటికీ, అది మాత్రమే జీవానికి మూలం కాదని బోధిస్తుంది. ఆధ్యాత్మిక క్రమశిక్షణ దేవుని పట్ల మన ఆకలిని పెంచుతుంది. అదే సమయంలో బాధ్యతాయుతమైన శరీర సంరక్షణ, క్రమశిక్షణతో కూడిన ఆత్మీయ జీవితం... ఈ రెండూ కలిసి లేఖనాలు చెప్పే 'జీవజలాన్ని' పొందుకోవడానికి మనల్ని సిద్ధం చేస్తాయి.

4. తీరిన దాహం: జీవజలపు వాగ్దానం

భౌతికమైన నీరు శరీరాన్ని బ్రతికిస్తే, మరి ఆత్మకు జీవాన్ని ఇచ్చేది ఏది? లోకంలో చాలా మంది విజయం, వినోదం, సంబంధాలు, గుర్తింపు లేదా సంపద ద్వారా తమ అంతరంగ తృష్ణను తీర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. లేఖనాలు వీటిని నీళ్ళు నిలువని "బద్దలైన తొట్లు" అని వర్ణిస్తున్నాయి (యిర్మీయా 2:13). ఇవి సంతృప్తిని ఇస్తామని వాగ్దానం చేస్తాయి కానీ, చివరికి ఆత్మను అశాంతితో ఎండిపోయినట్లుగా మారుస్తాయి.

యేసు ప్రభువు జనసమూహం మధ్య నిలబడి, ఈ సార్వత్రిక అవసరాన్ని ఉద్దేశించి ఇలా ప్రకటించారు: "ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు

విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారును" (యోహాను 7:37-38). అంతరంగంలో ఏర్పడే ఆత్మీయ అసంతృప్తి లేదా పొడిబారడం అనేది మీకు మరింత వినోదం కావాలని చెప్పే సంకేతం కాదు; అది మీ ఆత్మ దేవుని కోసం పరితపిస్తోందని చెప్పే గుర్తు. ప్రభువు మనకిచ్చిన ఈ శక్తివంతమైన ఆహ్వానంలో మూడు ముఖ్యమైన సత్యాలు ఉన్నాయి:

ఎ) అవసరం: "ఎవడైనను దప్పిగొనిన యెడల"

మొదటి మెట్టు మన అవసరాన్ని గుర్తించడం. విశ్వాసులుగా మనం నిజంగా దేవుని కోసం దాహంతో ఉన్నామా, లేక ఆత్మీయ శూన్యతతో జీవించడం అలవాటు చేసుకున్నామా? కీర్తన కారుడు తన వాంఛను (దాహార్తిని) ఇలా వ్యక్తపరిచాడు:

> ***"దుప్పి నీటి వాగుల కొరకు ఆశపడినట్లు దేవా, నీకొరకు నా ప్రాణము ఆశపడుచున్నది" (కీర్తన 42:1).***

అడవిలో నీటి కోసం వెళ్లే దుప్పికి ఎన్నో ప్రమాదాలు ఎదురవుతాయి. నీరు త్రాగడానికి తల దించినప్పుడు దుప్పికి ప్రమాదం పొంచి ఉంటుంది. అయినప్పటికీ, ప్రాణం కంటే నీటి అవసరమే ఎక్కువ కాబట్టి అది అన్వేషణను ఆపదు. మన సౌకర్యాల కంటే దేవుని పట్ల ఆశ పెరిగినప్పుడే నిజమైన ఆత్మీయ ఎదుగుదల ప్రారంభమవుతుంది.

బి) పరిష్కారం: "వచ్చి దప్పి తీర్చుకొనవలెను"

యేసు ఇచ్చే పరిష్కారం అత్యంత సరళమైనది. ఆయన మనల్ని ఏదో సాధించమని లేదా నిరూపించుకోమని కోరడం లేదు. కేవలం "రమ్మని" ఆహ్వానిస్తున్నారు. జీవజలము అనేది స్వయం కృషితో వచ్చేది కాదు, అది విశ్వాసం ద్వారా లభించే దైవిక బహుమానం. ఇది కేవలం రక్షణ పొందిన నాటితో ముగిసిపోయేది కాదు; ప్రార్థన, వాక్య ధ్యానం మరియు దేవునిపై నిరంతర ఆధారపడటం ద్వారా ప్రతిరోజూ పుష్కలంగా లభిస్తుంది. అయితే, దానిని వ్యక్తిగతంగా ఎవరికి వారే పొందుకోవాలి.

సి) వాగ్దానం: "జీవజల నదులు"

యేసు కేవలం దాహం తీర్చడమే కాదు, అది మనలో నుండి పొంగిపొర్లే అనుభవాన్ని వాగ్దానం చేస్తున్నారు. క్రీస్తుకు దగ్గరగా ఉండేవారు తమలో తామే "నిత్యజీవమునకై ఊరెడు నీటిబుగ్గను" కలిగి ఉంటారు (యోహాను 4:14). ఈ ఆధ్యాత్మిక పునరుజ్జీవనం కేవలం ఆ వ్యక్తికే పరిమితం కాదు; క్రీస్తు ద్వారా సేదదీరే వారు ఇతరులకు ఆశను, ప్రోత్సాహాన్ని అందించే కాలువలుగా మారుతారు. వారు ఎక్కడికి వెళితే అక్కడ ఆధ్యాత్మిక ఉజ్జీవాన్ని తీసుకువస్తారు.

5. ముగింపు

శరీరానికి ప్రతిరోజూ నీరు ఎంత అవసరమో, ఆత్మకు కూడా నిరంతర పునరుజ్జీవం అంతే అవసరం. లోకపు సౌకర్యాలు ఎంతటివైనా క్రీస్తుకు సాటిరావు, ఎందుకంటే "ఈ నీళ్లు త్రాగువాడు మరల దప్పిగొనును" (యోహాను 4:13). కేవలం ఆయన మాత్రమే మన హృదయ లోతుల్లోని దాహాన్ని శాశ్వతంగా తీర్చగలడు. ఆ పిలుపు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తోంది: దప్పిక కలిగి ఉండండి, ఆయన వద్దకు రండి, తృప్తిగా త్రాగండి మరియు ఫలించే జీవితాన్ని జీవించండి.

రిఫరెన్స్

1. 'క్రిస్టియన్, టేక్ కేర్ ఆఫ్ యువర్ బాడీ' – జెరెమీ బెల్
2. 'హోలీనెస్' – ఇట్స్ నేచర్, హిండరెన్స్, డిఫికల్టీస్ అండ్ రూట్స – జె.సి. రైల్

– సాదు అన్వేష్,
సైదాబాద్ జోన్

యాక్టివ్ లిజనింగ్
Active Listening
కేవలం వినడం కాదు, హృదయంతో గ్రహించడం

ఎవరైనా మీతో మాట్లాడుతున్నప్పుడు, మీరు వారి వైపు చూస్తూ తల ఊపుతున్నా... మీ మనసు మాత్రం ఎక్కడో వేరే ఆలోచనల్లో ఉండటం ఎప్పుడైనా గమనించారా? ఇది మనందరికీ అనుభవమే. వింటున్నట్లు నటించడమే తప్ప, నిజంగా వినకపోవడం. దీన్నే 'ప్యాసివ్ హియరింగ్' (Passive Hearing) అంటారు. కానీ, మార్కు సువార్త 4:9లో యేసు ప్రభువు, **"వినడానికి చెవులు ఉన్నవాడు వినును గాక"** అని చెప్పినప్పుడు, ఆయన ఉద్దేశం కేవలం శబ్దాలు వినడం గురించి కాదు. ఆయన మాటల అంతరార్థం ఏమిటంటే–మనం లోతైన అవగాహనతో, పూర్తి శ్రద్ధతో వినాలి.

బైబిల్ అంతటా దేవుడు మనల్ని కోరుతున్నది ఒక్కటే. ఆయన మాటలను కేవలం పైపైన వినడం కాదు, వాటిని మనస్ఫూర్తిగా స్వీకరించి, మన జీవితాలను మార్చుకోవడం. యేసు ప్రభువు బోధనలు కేవలం మాటలు కాదు; అవి మనల్ని లోతైన విశ్వాసం వైపు నడిపించే జీవన సత్యాలు. మనం యేసును ప్రేమించి, ఆయనను గౌరవించినప్పుడు, ఆయన మాటల పట్ల మన వైఖరి మారుతుంది. ఏదో బాధ్యత కోసం కాకుండా, ప్రేమతో ఆయన మాటలకు విలువిస్తాము.

ఈ రకమైన వినడం నిజమైన భక్తికి నిదర్శనం. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో, కాసేపు ఆగి ఆయన పాదాల చెంత కూర్చోవడం, ఈ లోకపు గందరగోళం మధ్య ఆయన మృదువైన స్వరాన్ని వినడానికి సమయం కేటాయించడమే నిజమైన ఆరాధన. మనం కేవలం ప్రేక్షకుల ుగా ఉండిపోకూడదు; ఆయన సత్యం ద్వారా మన జీవితాలను మార్చుకునే భాగస్వాములుగా మారాలి. ఈ అలవాటును కేవలం ప్రార్థనకే పరిమితం చేయకుండా, మన చుట్టూ ఉన్నవారితో, కష్టాల్లో ఉన్నవారితో మాట్లాడేటప్పుడు కూడా చూపించాలి.

1. యాక్టివ్ లిజనింగ్ అంటే ఏమిటి?

యాక్టివ్ లిజనింగ్ అనేది కేవలం శబ్దాలను చెవిన వేసుకోవడం కంటే ఉన్నతమైనది. ఇది వక్త చెప్పే మాటల వెనుక ఉన్న అర్థాన్ని గ్రహించడం, వారి భావోద్వేగాలను అనుభూతి చెందడం మరియు సరైన ఉద్దేశ్యంతో స్పందిస్తూ వారితో హృదయపూర్వక సంబంధాన్ని ఏర్పరచుకోవడం. దీని ద్వారా వినేవారు కేవలం శ్రోతగా మాత్రమే కాకుండా, ఒక సహానుభూతి కలిగిన వ్యక్తిగా మారుతారు.

2. వినడం వర్సెస్ యాక్టివ్ లినింగ్

* **వినడం:** ఇది ఒక శారీరక ప్రక్రియ. శబ్దాలు

చెవికి తగలడం ఇందులో మన దృష్టి లేదా శ్రద్ధ ఉండవచ్చు, ఉండకపోవచ్చు.

* **యాక్టివ్ లిజనింగ్:** వక్తపై పూర్తి శ్రద్ధ పెట్టి, వారు చెప్పే విషయాల అంతరార్థాన్ని గ్రహించడం. దీని ఫలితంగా స్పష్టమైన మరియు సందర్భోచితమైన ప్రతిస్పందన ఇవ్వడం సాధ్యమవుతుంది.

3. ఆధ్యాత్మిక మరియు నైతిక దృక్పథం

బైబిల్ కూడా దేవుని మాటలను కేవలం వినడమే కాకుండా, వాటిని హృదయంతో స్వీకరించి జీవితాలను మార్చుకోవాలని ప్రబోధిస్తున్నాయి. బోధనలను గౌరవించి, మన అంతరంగంలోకి ఆహ్వానించడం ద్వారానే అవి మన ప్రవర్తనలో మార్పు తీసుకురాగలవు. ఈ గుణం మన ప్రార్థనల్లో, వ్యక్తిగత సంబంధాల్లో ప్రతిబింబించాలి.

4. యాక్టివ్ లిజనింగ్ అలవరచుకోవడానికి 6 సులభమైన పద్ధతులు

* **పూర్తిగా నిమగ్నం కావడం (Be Present):** సంభాషణ జరుగుతున్నప్పుడు మీ దృష్టి, శారీరక భాష మరియు ఆలోచనలు అక్కడే ఉండాలి.
* **ఓపికతో వినడం (Patient Listening):** ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు వెంటనే స్పందించాలని అనుకోకుండా, వారి భావాలను పూర్తిగా వినాలి.
* **ప్రతిబింబించేలా స్పందించడం (Reflective Responses):** “మీరు చెప్పేది చూస్తుంటే ఈ విషయం మీకు చాలా బాధ కలిగించినట్లుంది” వంటి వాక్యాలతో వారి భావాలను మీరు అర్థం చేసుకున్నారని తెలపాలి.
* **స్పష్టీకరణ (Clarifying Questions):** సందేహాలు ఉంటే ప్రశ్నలు అడగండి.

ఉదాహరణకు: “నేను అర్థం చేసుకున్నది సరైనదేనా?” లేదా “ఆ సమయంలో నీకు ఏమనిపించింది?”

* **రిఫ్లెక్టివ్ సమ్మరీ (Reflective Summary):** సంభాషణ ముగిసే ముందు ప్రధాన అంశాలను ఒకసారి క్లుప్తంగా చెప్పడం వల్ల ఇద్దరికీ స్పష్టత వస్తుంది. ఇది చెల్లాచెదురుగా ఉన్న ఆలోచనలను ఒకచోట చేర్చడానికి మరియు సంభాషణను తదుపరి దశకు తీసుకెళ్లడానికి సహాయపడుతుంది.
* **సముచితమైన స్పందన (Suitable Response):** అవసరమైతేనే సలహాలు ఇవ్వాలి, లేదంటే కేవలం వారి భావాలను పంచుకుంటూ అండగా ఉండాలి.

5. నాన్-వర్బల్ సిగ్నల్స్ (మౌన సంకేతాలు)

మాటల కంటే మన శరీర భాష ఎదుటివారికి ఎక్కువ భరోసా ఇస్తుంది:

* **ఐ కాంటాక్ట్ (Eye Contact):** సాంస్కృతిక నిబంధనలను గౌరవిస్తూనే, అవతలి వ్యక్తి కళ్ళలోకి చూస్తూ వినడం ద్వారా మీరు వారి మాటలను శ్రద్ధగా వింటున్నారని సూచిస్తుంది.
* **శరీర భంగిమ (Posture):** సంభాషణ వైపు కొద్దిగా వంగి ఉండటం ఆసక్తిని తెలుపుతుంది. చేతులు కట్టుకోకుండా ప్రశాంతంగా ఉండాలి.
* **తల ఊపడం (Nodding):** ఇది వక్తను ప్రోత్సహిస్తుంది మరియు మీరు విషయాలను అనుసరిస్తున్నారని తెలియజేస్తుంది.
* **ముఖ కవళికలు (Facial Expressions):** ఎదుటివారి భావాలకు అనుగుణంగా (చిరునవ్వు లేదా బాధ) మీ ముఖంలో స్పందన కనిపించాలి.

6. నివారించాల్సిన సాధారణ లోపాలు

* **తక్షణ పరిష్కారాలు చూపడం (Delayed Judgement):** వింటున్నప్పుడే సలహాలు ఇవ్వడానికి ప్రయత్నించకండి. ముందు వారిని పూర్తిగా చెప్పనివ్వండి.
* **మధ్యలో అడ్డుపడటం (Impulse Control):** ఎదుటి వారు వాక్యాన్ని పూర్తి చేయకముందే మీ అభిప్రాయాన్ని చెప్పడం మంచి పద్ధతి కాదు.
* **పరధ్యానం (Distraction):** ఫోన్ చూడటం లేదా ఇతర పనుల్లో నిమగ్నం కావడం ఎదుటివారిని అవమానించినట్లు అవుతుంది.

"వినడానికి వేగిరపడువాడును, మాటలాడ డానికి నిదానించువాడునై ఉండవలెను" (యాకోబు 1:19)

7. క్రీస్తు కరుణ - యాక్టివ్ లిజనింగ్

యేసు ప్రభువు జీవితం 'యాక్టివ్ లిజనింగ్'కు అత్యుత్తమ ఉదాహరణ. ఆయన కేవలం మాటలు వినడమే కాదు, మనుషుల హృదయాలను విన్నారు.

* **పూర్తి లీనమవడం (Full Presence):** ఎంత బిజీగా ఉన్నా, యేసు తన వద్దకు వచ్చిన వారికి తన పూర్తి సమయాన్ని, శ్రద్ధను ఇచ్చారు.
* **సానుభూతి (Empathy):** లాజరు సమాధి వద్ద యేసు కన్నీరు కార్చారు (యోహాను 11:35). ఇది కేవలం సమస్య పరిష్కారం గురించి కాదు, దు:ఖంలో పాలుపంచుకోవడం గురించి.
* **అవసరాలను గుర్తించడం (Identifying the Needs):** బావి వద్ద ఉన్న సమరయ స్త్రీతో మాట్లాడినప్పుడు, ఆమె అడగని లోతైన ఆత్మీయ దాహాన్ని ఆయన గుర్తించారు.

"వినడానికి వేగిరపడువాడును, మాటలాడడానికి నిదానించువాడునై ఉండవలెను" (యాకోబు 1:19) అనే వాక్యం చురుకుగా వినడానికి మూల స్తంభం. మనం కూడా యేసు వలె ఇతరులను విలువైనవారిగా గుర్తిస్తూ, మన సొంత అజెండాను పక్కనపెట్టి, వారి భావోద్వేగాలకు విలువనిద్దాం.

8. ఆచరణలో పెట్టడం ఎలా?

* **వినయం (Humility):** నేను చెప్పేదే రైట్ అని నిరూపించుకోవాలనే తపనను పక్కన పెట్టండి.
* **ఏకాగ్రత (Focus):** ఫోన్ వంటి డిస్ట్రాక్షన్స్ పక్కనపెట్టి, వక్త మాటలు, స్వరం మరియు బాడీ లాంగ్వేజ్‌పై దృష్టి పెట్టండి.
* **హృదయాన్ని వినండి (Listen to the Hearts):** సలహా ఇచ్చే ముందు వారి బాధను గుర్తించండి.

ముగింపు

యాక్టివ్ లిజనింగ్ అనేది కేవలం ఒక నైపుణ్యం మాత్రమే కాదు, అది మన కుటుంబం, సమాజం మరియు ఆధ్యాత్మిక జీవితంలో సంబంధాలను బలపరిచే ఒక గొప్ప సాధనం. దీన్ని అభ్యాసం చేయడం ద్వారా మనం మరింత సహానుభూతి గల వ్యక్తులుగా మారవచ్చు. నేటి నుండే ఒక చిన్న నిర్ణయం తీసుకోండి "నేను ఎదుటివారిని కేవలం చెవులతో కాదు, హృదయంతో వింటాను." అప్పుడే మీ సంబంధాల్లో అద్భుతమైన మార్పును చూస్తారు.

ప్రార్థన:

పరలోకపు తండ్రీ, మా పాదాలకు దీపముగా, మా త్రోవకు వెలుగుగా ఉన్న మీ వాక్యానికి స్తోత్రాలు. కేవలం చెవులతోనే కాకుండా, హృదయంతో వినడం మాకు నేర్పించండి. మీ స్వరాన్ని, మా చుట్టూ ఉన్నవారి ఆర్తనాదాలను వినేలా మా చెవులను సిద్ధపరచండి. మేము వినే విధానం... లోకం పట్ల మీకున్న ప్రేమకు, కృపకు ప్రతిబింబంగా ఉండును గాక. యేసు నామములో, ఆమెన్.

– రమణ, శంషాబాద్

జీవితగాథ



డి.ఎల్. మూడీ

(1837-1899)

దేవుని ప్రేమను ప్రపంచానికి పంచిన సామాన్యుడు

19వ శతాబ్దపు ఆధ్యాత్మిక గగనంలో, డ్వైట్ ఎల్. మూడీ అనే నక్షత్రం అత్యంత ప్రకాశవంతంగా వెలిగింది. అయితే, ఆ విశేషమైన వెలుగు వెనుక ఉన్నది ఒక సాధారణ, చదువులేని పల్లెటూరి బాలుడు. అతని జీవితగాథ దేవుని కృప ఒక సామాన్యుని జీవితాన్ని ఎలా అసాధారణంగా మార్చగలదో చెప్పే శక్తివంతమైన ఉదాహరణ.

> *"నేను 1837లో భౌతికంగా జన్మించాను. 1856లో ఆత్మీయంగా జన్మించాను."*

మసాచుసెట్స్‌లోని ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి, ప్రాథమిక విద్యకు కూడా నోచుకోని ఆ బాలుడు, 19వ శతాబ్దంలో అత్యంత ప్రభావవంతమైన ఆధ్యాత్మిక నాయకులలో ఒకరిగా ఎదిగాడు. ఆయన ప్రభావం ఖండాలు దాటి లక్షలాది మంది హృదయాలను తాకింది. తన జీవితాన్ని ఆయన ఈ మాటలతో వర్ణించారు: "నేను 1837లో భౌతికంగా జన్మించాను. 1856లో ఆత్మీయంగా జన్మించాను." ఈ మాటలు భౌతిక జననం నుంచి ఆధ్యాత్మిక పునరుజ్జీవనం వరకు సాగిన ఆయన అద్భుతమైన పరివర్తన ప్రయాణానికి అద్దం పడతాయి.

కష్టాలతో కూడిన బాల్యం

మూడీలో ఉన్న దృఢమైన, పట్టుదల కలిగిన వ్యక్తిత్వానికి పునాది ఆయన బాల్యంలోనే పడింది. ఆ కష్టాలను అర్థం చేసుకోవడం, ఆయన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి చాలా కీలకం. తొమ్మిది మంది పిల్లలు ఉన్న కుటుంబంలో, తండ్రి చిన్న వయసులోనే చనిపోవడం, వారిని పేదరికంలో పెంచడానికి ఆయన తల్లి చేసిన అలుపెరుగని పోరాటం, కఠినమైన ప్యూరిటన్ (ఒక క్రైస్తవ శాఖ) క్రమశిక్షణ మధ్య ఆయన బాల్యం గడిచింది. ఈ అనుభవాలే ఆయనను ఒక ఉక్కు మనిషిగా తీర్చిదిద్దాయి.

నార్త్‌ఫీల్డ్‌లో ఆయన బాల్యం గడిచింది. ఆయన తండ్రి 41 ఏళ్ళ వయసులో హఠాన్మరణం చెందడంతో, ఆ కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. అప్పులిచ్చిన వారు షెడ్‌లోని కట్టెపుల్లల వరకు, దొరికిన ప్రతీదాన్నీ తీసుకెళ్లారు. ఈ కష్టకాలంలో, చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం ఎంత ముఖ్యమో ఆయన తల్లి నేర్పించారు. పిల్లలు ఏదైనా పని చేస్తామని ఒప్పుకుంటే, దాన్ని తప్పకుండా పూర్తి చేయాల్సిందే.

తల్లి బోధన: "నువ్వు చేస్తానని చెప్పావా?" ("Did you say you would?") అనే ఆమె ప్రశ్న వారి జీవితాంతం గుర్తుండిపోయింది.

చిన్నతనం నుంచే ఆయనలో తెలివైన తుంటరితనం, పట్టుదల రెండూ కనిపించేవి. ఐదేళ్ల వయసులో, వాళ్ల అమ్మమ్మ ఇంటికి వెళ్ళడానికి, చేతిలో ఉన్న అడవి పూల గుత్తిని బండివాడికి ఇచ్చి ప్రయాణం చేశాడు. ఆయన తల్లి క్రమశిక్షణ విషయంలో చాలా కఠినంగా ఉండేవారు. ఒకసారి, మూడీని కొట్టడానికి, అతడినే ఒక పుల్ల తీసుకురమ్మని పంపారు, అది పచ్చిదో కాదో చూసుకుని మరీ తెమ్మంది. మూడీ తన తల్లి క్రమశిక్షణను గౌరవించినప్పటికీ, భయం కంటే ప్రేమ శక్తివంతమైనదని చిన్న వయసులోనే గ్రహించాడు. అందుకే, తన సొంత కుటుంబాన్ని 'చట్టం' అనే కఠినమైన దండంతో కాకుండా, 'కృప' అనే వెచ్చని కౌగిలితో నడిపించాలని నిర్ణయించుకున్నాడు.

బోస్టన్: మలుపు తిరిగిన జీవితం

కొంతకాలానికి, "తనకంటూ ఒక జీవితాన్ని నిర్మించుకోవాలి" అనే ఆశయంతో బోస్టన్‌కు వెళ్ళాడు. మొదట్లో నిరాశే ఎదురైంది. చివరకు, తన మామయ్య బూట్ల దుకాణంలో ఉద్యోగం దొరికింది, కానీ కొన్ని కఠినమైన షరతులతో. తప్పనిసరిగా చర్చికి, సండే స్కూల్‌కు హాజరు కావాలి అనేవి ఆ షరతులలో ముఖ్యమైనవి. బోస్టన్‌లో వ్యాపారంలో రాణించాలనే ఆయన ఆశయం, ఊహించని ఒక ఆధ్యాత్మిక సంఘటనతో జీవితం మారుతుందని అప్పుడు ఆయనకు తెలియదు.

జీవితాన్ని మార్చిన క్షణం

ఒక నిజమైన అనుభవం జీవితాన్ని ఎంతగా మారుస్తుందో చెప్పడానికి మూడీ జీవితమే ఒక ఉదాహరణ. ఈ ఘటన ఆయన జీవితానికి కేంద్ర బిందువు. ఆయన ఆశయం సంపదను కూడబెట్టడం నుంచి తన జీవితాన్ని దేవుని సేవకు అంకితం చేయడం వైపు మళ్లింది.

"అతడు తన జీవితాన్ని క్రీస్తుకు అప్పగించాడు ... బోస్టన్లోని ఆ దుకాణం వెనుక, ఆ యువకుడు అప్పుడు తనపై ప్రకాశించిన వెలుగు కోసం సిద్ధంగా ఉన్నట్లు అనిపించింది"

ఆయన సండే స్కూల్ టీచర్, మిస్టర్ కింబాల్, ఆ క్షణాన్ని ఇలా గుర్తుచేసుకున్నారు: "అతనితో క్రీస్తు గురించి, అతని ఆత్మ గురించి మాట్లాడాలని నేను నిశ్చయించుకున్నాను... నేను హోల్టన్ బూట్ల స్టోర్‌కు బయలుదేరాను. నేను అక్కడికి చేరుకుంటున్నప్పుడు, వ్యాపార సమయంలో లోపలికి వెళ్లాలా వద్దా అని సందేహించాను... నేను ఒకేసారి లోపలికి దూసుకెళ్లి ఆ పని పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాను... మూడీ దుకాణం వెనుక భాగంలో బూట్లను ప్యాక్ చేస్తున్నాడు. నేను నేరుగా అతని వద్దకు వెళ్లి, అతని భుజంపై చేయి వేసి, క్రీస్తు ప్రేమ అతని కోసం ఎంత గొప్పదో, ప్రతిఫలంగా క్రీస్తు అతని నుండి ఎలాంటి ప్రేమను కోరుకుంటున్నాడో చెప్పాను. అంతే, ఆ యువకుడు అప్పుడు తనపై ప్రకాశించిన వెలుగు కోసం సిద్ధంగా ఉన్నట్లు అనిపించింది మరియు బోస్టన్‌లోని ఆ దుకాణం వెనుక, అతడు తన జీవితాన్ని క్రీస్తుకు అప్పగించాడు."

ఈ సంఘటన ఏదో బహిరంగ ప్రదర్శన కాదు. ఇది నిశ్శబ్దంగా, వ్యక్తిగతంగా జరిగిన ఒక కీలకమైన నిర్ణయం. కానీ అది ఆయన ప్రాధాన్యతలను పూర్తిగా మార్చేసింది. ఒక చరిత్రకారుడు

చెప్పినట్లుగా, "అతనికి కావలసింది మరింత నీతి కాదు, గొప్ప శక్తి." ఆ నిశ్శబ్ద క్షణం ఆయన జీవిత గమనాన్ని మార్చింది. సంపద కోసం పరుగులు తీస్తున్న ఆ యువకుడి అడుగులు, ఇప్పుడు చికాగో వీధుల్లో ఆత్మల రక్షణ కోసం సాగే ఒక మహాయాత్రకు నాంది పలకబోతున్నాయి.

వ్యాపారాన్ని విడిచి దేవుని సేవకు అంకితం

విజయవంతమైన వ్యాపార జీవితాన్ని విడిచి పెట్టాలనే మూడీ నిర్ణయం చాలా పెద్దది. ఆయన $100,000 సంపాదించాలనే తన ఆర్థిక లక్ష్యానికి చేరువలో ఉన్న సమయంలో, ఒకే ఒక్క అనుభవం ఆయన్ను అన్నీ వదులుకుని, ఎటువంటి జీతం గ్యారెంటీ లేని విశ్వాస ఆధారిత సేవకు పురి కొల్పింది.

చికాగోలో, ఆయన మొదట నాలుగు ప్రదేశాలను అద్దెకు తీసుకుని, వీధుల్లోని యువకులను తీసుకువచ్చి ప్రతి ఆదివారం వాటిని నింపేవాడు. నగరంలోని పేద, అల్లరి పిల్లల ("స్ట్రీట్ గ్యాంగ్‌లు") కోసం నార్త్ మార్కెట్ హాల్ సండే స్కూల్‌ను స్థాపించాడు. ఆయన జీవితాన్ని మార్చిన కీలకమైన సంఘటన ఇక్కడే జరిగింది. తన తరగతిలోని "అల్లరి" అమ్మాయిలలో ఒక్కరిని కూడా క్రీస్తు వైపు నడిపించలేకపోయానని ఒక సండే స్కూల్ టీచర్ ఎంతో బాధపడ్డాడు. మూడీ ఆ టీచర్‌ను తీసుకుని ప్రతి అమ్మాయి ఇంటికి వెళ్ళాడు. కేవలం పది రోజుల్లో, ఆ తరగతిలోని ప్రతి అమ్మాయి క్రీస్తును అంగీకరించింది.

ఆ ప్రార్థన సమావేశం ఒక చారిత్రక ఘట్టం. మరణానికి చేరువలో ఉన్న ఆ టీచర్, కొత్తగా క్రీస్తును కనుగొన్న కొంతమంది అమ్మాయిలు మరియు వారి మధ్యలో తన జీవిత లక్ష్యాన్ని కనుగొన్న ఒక యువకుడు – ఆ గదిలోని ఆధ్యాత్మిక శక్తి మూడీ హృదయాన్ని మండించింది.

> **"అక్కడ మేం చాలా సంతోషించాం... ఆ సమయంలో దేవుడు నా ఆత్మలో ఆరిపోని అగ్నిని రగిలించాడు." – మూడీ**

ఈ సంఘటనే వ్యాపారిన్ని పూర్తిగా విడిచిపెట్టాలనే ఆయన నిర్ణయాన్ని బలపరిచింది. చికాగోలో స్థానికంగా ప్రారంభమైన ఆయన సేవ, త్వరలోనే అంతర్జాతీయ వేదికపైకి విస్తరించి ప్రపంచాన్ని కదిలించింది.

ప్రపంచవ్యాప్త మేల్కొలుపు

మూడీ ప్రభావం అమెరికా తీరాలను దాటి గ్రేట్ బ్రిటన్‌లో ఒక ఆధ్యాత్మిక మేల్కొలుపుకు దారి తీసింది. ఆయన విజయం అధికారిక విద్య లేదా ప్రసంగ చాతుర్యం వల్ల రాలేదు, కానీ ఆయనకున్న నిజాయితీ మరియు సువార్త యొక్క సరళమైన, శక్తివంతమైన సందేశం వల్ల వచ్చింది.

ఒక వై.ఎం.సి.ఏ. కాన్ఫరెన్స్‌లో ఆయన గాయకుడు ఐరా డి. సాంకీని కలిశారు. మూడీ సాంకీతో



నేరుగా ఇలా అన్నారు: "నేను వెతుకుతున్న వ్యక్తివి నువ్వే... నువ్వు చికాగో వచ్చి నా పనిలో సహాయం చేయాలి." వారిద్దరి కలయిక అద్భుతాలు సృష్టించింది. ఇద్దరూ కలిసి "మూడీ అండ్ సాంకీ హిమ్ బుక్‌ను" సృష్టించారు, దీని ప్రభావం అపారమైనది. దీనిపై వచ్చిన రాయల్టీలను వారు వ్యక్తిగత లాభం కోసం ఉంచుకోలేదు. మొదట చికాగోలో అగ్నిప్రమాదంలో దెబ్బతిన్న చర్చిని పూర్తి చేయడానికి, ఆ తరువాత నార్త్‌ఫీల్డ్ పాఠశాలలకు నిధులు సమకూర్చడానికి ఉపయోగించారు.

వారి ప్రచారాలు (క్యాంపెయిన్స్) స్కాట్లాండ్, లండన్‌లలో గొప్ప ప్రభావాన్ని చూపాయి. ప్రారంభంలో లండన్‌లో వ్యతిరేకత ఎదురైంది.

పత్రికలు ఆయనను "అత్యంత అసభ్యకరమైన ప్రసంగీకుడు" అని ఎగతాళి చేశాయి, "వ్యానిటీ ఫెయిర్" వంటి మ్యాగజైన్లలో ఆయన వ్యంగ్య చిత్రాలు వేశారు. కానీ, ఆయన నిజాయితీగల ప్రసంగాలు సందేహవాదులను సైతం ఆకట్టుకున్నాయి. త్వరలోనే, లార్డ్ ఛాన్సలర్ వంటి ప్రముఖులు వారిని ప్రశంసించారు. తన ప్రపంచ సువార్త పరిచర్యను విద్య ద్వారా శాశ్వత వారసత్వంగా మార్చాలనే కోరిక ఆయనలో కలిగింది.

విద్య మరియు శిక్షణ

నిజమైన, శాశ్వతమైన ప్రభావం తన ప్రసంగాల ద్వారా మాత్రమే కాదని, భవిష్యత్ తరాల క్రైస్తవ కార్యకర్తలను తయారు చేయడం ద్వారా వస్తుందని మూడీ గ్రహించారు. ఆయన కేవలం స్కూళ్లను నిర్మించడం లేదు; తాను ఒంటరిగా చేయలేని పనిని కొనసాగించడానికి "గ్యాప్-మెన్" (సామాన్యులు మరియు పరిచారకుల మధ్య గ్యాప్‌ను పూరించే వారు) అనే సైన్యాన్ని నిర్మించాడు. తన సొంత విద్యాభ్యాసం లేమి నుండి ప్రేరణ పొంది, తాను ఎన్నడూ పొందలేని అవకాశాన్ని ఇతరుల కోసం సృష్టించాడు.

ఆయన బాలికల కోసం నార్త్‌ఫీల్డ్ సెమినరీని, బాలుర కోసం మౌంట్ హెర్మాన్ స్కూల్‌ను స్థాపించారు. ఆర్థిక స్థోమత తక్కువగా ఉన్న యువతకు నాణ్యమైన, బైబిల్ ఆధారిత విద్యను అందించడమే ఆయన ప్రేరణ. ఈ పాఠశాలల్లో ఒక ప్రత్యేక సూత్రం ఉండేది: విద్యార్థులందరూ తప్పనిసరిగా శారీరక శ్రమ చేయాలి. ఇది వినయాన్ని ప్రోత్సహించడమే కాక, అన్ని నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులు సమాన స్థాయిలో స్టార్ట్ అయ్యేలా చేసి "సామాజిక అడ్డంకులను తొలగించింది." చికాగో బైబిల్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించడానికి గల తన ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, "సామాన్యులు మరియు పరిచారకుల మధ్య నిలబడే" ఆచరణాత్మక కార్యకర్తలను తయారు చేయాలని తాను నమ్ముతున్నానని మూడీ చెప్పారు.

ఈ సంస్థల ద్వారా వేలాది మంది విద్యార్థులు ట్రైనింగ్ పొంది, పాస్టర్‌లుగా, మిషనరీలుగా మరియు లౌకిక ఉద్యోగాలలో అంకితభావంతో పనిచేసే సాధారణ విశ్వాసులుగా ప్రపంచవ్యాప్తంగా సేవ చేయడానికి వెళ్లారు.

ముగింపు

మూడీని ఆయన సమకాలికులు "దేవునికి అంకితం చేయబడిన ఆచరణాత్మక జ్ఞానం" (consecrated common sense) కలిగిన వ్యక్తిగా వర్ణించారు. అపారమైన శక్తి, లోతైన వినయం మరియు సరళమైన, బైబిల్ ఆధారిత విశ్వాసం ఆయన జీవితానికి నిదర్శనాలు.

డిసెంబర్ 22, 1899న ఆయన చివరి క్షణాలు చాలా శక్తివంతమైనవి మరియు కదిలించేవి. ఆయన మరణం నుంచి జీవంలోకి ప్రశాంతంగా మారుతున్న క్షణాన్ని తన మాటల్లోనే ఇలా వర్ణించారు:

> **"భూమి దూరమవుతోంది; స్వర్గం నా ముందు తెరుచుకుంటోంది... ఇది కల కాదు... ఇదే మరణమైతే, ఇది చాలా మధురంగా ఉంది. ఇక్కడ లోయ లేదు. దేవుడు నన్ను పిలుస్తున్నాడు, నేను వెళ్ళాలి."**

ఆ సమయంలో, మరణించిన తన ఇద్దరు మనవరాళ్లు, "డ్వైట్! ఐరీన్!" అంటూ వారి ముఖాలను చూస్తున్నానని కూడా ఆయన చెప్పారు.

1856లో "ఆత్మీయంగా జన్మించిన" ఆయన ప్రయాణం, 1899లో "స్వర్గం తెరుచుకోవడంతో" ముగిసింది. ఏమీ లేకుండా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన డ్వైట్ ఎల్. మూడీ, ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసం, సేవ మరియు రూపాంతరం చెందిన జీవితాల రూపంలో అపారమైన వారసత్వాన్ని విడిచిపెట్టాడు.

– రూత్ వినయ్
ప్రగతినగర్, సైబరాబాద్

(పై వ్యాసం ఇంటర్నెట్ వనరుల నుండి సేకరించబడినది)



అమ్నేషియా
Amnesia

గడచిన ఏడాదిని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఏముంది? యుద్ధాలు, ఊహించని ప్రమాదాలు, అకాల వర్షాలు, బీభత్సం సృష్టించిన వరదలు, హింస, నెత్తురోడిన రహదారులు. గమ్యం చేరాలని బస్సెక్కిన ప్రయాణికులు సజీవ దహనమైన విషాదాలు, కూలిపోయిన విమానాలు, అల్లర్లు, అరాచకాలు.. ఇలా ఎన్నో! వీటికి తోడు వార్తలకెక్కని మరెన్నో గుండె కోతలు.

రోజూ గడిచే కొద్దీ కాలం ఎంత వేగంగా పరుగులెత్తిందో అర్థం కావడం లేదు. 2025 సంవత్సరం ఎంతో హడావిడిగా, దుమ్మురేపుకుంటూ ముగిసిపోయింది. “ఈ ఏడాది అందరినీ ఒక ఆట ఆడించింది” అని ఆలోచిస్తున్న ఉదయ్‌కు మనసు భారమైంది. ఎందరో మహానుభావులను, ఆత్మీయులను, గొప్ప గొప్ప సేవకులను ఈ ఏడాదే కోల్పోయామన్న జ్ఞాపకం అతడిని మరింత కలిచివేసింది.

******

అంతలోనే అజయ్ అన్న నుండి కాల్ రావడంతో ఉదయ్ ఆలోచనలకు బ్రేక్ పడింది. అజయ్ తన రూమ్‌కు వస్తున్నాడని చెప్పడంతో, ఉదయ్ హడావిడిగా గదిని సర్దడం మొదలుపెట్టాడు. లేకపోతే, “ఏంటి తమ్ముడూ, రూమ్‌ని ఇంత మెస్సీగా ఉంచుకున్నావు?” అని అన్నయ్య మందలిస్తాడనే చిన్న భయం.

అజయ్ రానే వచ్చాడు. హడావిడిగా సర్దిన ఆ గదిని చూసి అర్థమైనట్లుగా చిన్నగా నవ్వుకుని, “ఏంటి తమ్ముడూ, ఖాళీగా ఉన్నట్లున్నావు?” అని పలకరించాడు.

“ఎప్పుడూ ఖాళీనే కదన్నా! చదువు లేదు, ఉద్యోగం

లేదు. నేను అనుకున్న ఏ గోల్ కూడా రీచ్ అవ్వలేకపోయాను" అంటూ నిట్టూర్చాడు ఉదయ్.

"చూడు ఉదయ్, అంతలా బాధపడకు. నీ పట్ల దేవునికి ఒక గొప్ప ప్రణాళిక ఉంటుంది. నీ చింతను ఆయనపై వేయి, నీవే మోయకు" అని అజయ్ అనునయంగా చెప్పాడు. తరచూ వినే మాటలే కావడంతో ఉదయ్ పెద్దగా కాంప్రమైజ్ కాలేకపోయాడు. గోడ వైపు చూస్తూ భారంగా 'ఊ' కొట్టాడు. కానీ, ఉదయ్ కళ్లలో తిరిగిన కన్నీటిని అజయ్ గమనించాడు.

******

"అయ్యో తమ్ముడూ! కలిసి కాసేపు ప్రార్థన చేసుకుందామని వచ్చాను. నిన్ను డిస్టర్బ్ చేయలేదు కదా?" అని అడిగాడు అజయ్.

"లేదు అన్నా.. ఏదో తెలియని బాధ. ప్రార్థన చేయడానికి కూడా మనసు రావడం లేదు" అని బదులిచ్చాడు ఉదయ్.

"ప్లీజ్ ఇలా కూర్చో. ఉద్యోగం రాలేదని నిరాశ చెందకు. ప్రతిదానికీ ఒక సమయం ఉంటుంది. దేవుడు నమ్మదగినవాడు. గడచిన ఏడాదిలో ఎంతోమంది కన్నుమూశారు. వాళ్లందరూ ఈ నూతన సంవత్సరంలో అడుగుపెట్టాలని అనుకునే ఉంటారు కదా? కానీ మనకు మాత్రం దేవుడు ఆ అవకాశం ఇచ్చాడు. ఎందుకంటావు? మనం వాళ్లకంటే గొప్పవాళ్లమా? కాదు.. అది కేవలం ఆయన కృప మాత్రమే! మన అవసరాలు తీర్చడానికో, ఆయన ఉద్దేశ్యాలు నెరవేర్చుకోవడానికో మనకు మరొక నూతన సంవత్సరాన్ని దయా కిరీటంగా ఇచ్చాడు. నీ కోసం ప్రాణాన్ని పెట్టిన దేవుడు, నీ ప్రాథమిక అవసరాలను తీర్చలేడా?" అని ధైర్యం చెప్పాడు.

******

"గతంలో దేవుడు మనకు చేసిన మేళ్లను తల పోసుకుంటూ మనం కృతజ్ఞత కలిగి ఉండాలి. ఏదో ఒకటి జరగలేదని దేవునికి దూరం కాకూడదు. పదిమంది కుష్ఠురోగులను స్వస్థపరిస్తే, తిరిగి వచ్చి కృతజ్ఞత చెప్పింది ఒక్కడే కదా! మిగిలిన తొమ్మిది మంది ఏరని యేసుక్రీస్తు అడిగిన సందర్భం నీకు గుర్తుంది కదా?" అన్నాడు అజయ్.

ఆ మాటలతో ఉదయ్ ఆలోచనలో పడ్డాడు. దేవుడు గత ఏడాదిలో తనపై చూపిన కృపను, చేసిన మేళ్లను ఒక్కొక్కటిగా గుర్తు చేసుకున్నాడు. తన మతిమరుపుతనాన్ని తలచుకుంటూ నవ్వుతూ తల మీద చిన్నగా కొట్టుకున్నాడు.

"ఇంకాస్త గట్టిగా కొట్టుకో తమ్ముడూ! నీకున్న ఈ అమ్నేషియా - అంటే నీ మతిమరుపు - అప్పుడే వదులుతుంది" అని అజయ్ జోక్ చేశాడు.

ఆ మాటలకు ఉదయ్ మనస్ఫూర్తిగా నవ్వాడు. మనసు తేలికపడటంతో చిన్నగా ప్రార్థన చేసుకున్నాడు:

> **"దేవా! అనవసరమైన విషయాలు గుర్తుంచుకుని బాధపడకుండా ఉండేలా నాకు అమ్నేషియా దయచేయి. కానీ, నువ్వు చేసిన మేళ్లను నిరంతరం గుర్తుంచుకోవడానికి మాత్రం నాకున్న ఈ అమ్నేషియాను తీసివేయి."**

ఈసారి అజయ్ పడిపడి నవ్వాడు.

- చేగూడి శ్యామలా కృపారావ్,
టీచర్ మరియు గ్రాడ్యుయేట్, రాజేంద్రనగర్ జోన్

* * * * * *

REQUIREMENT

A **graduate helper** is required to work among **neighbor students in the Old City area of the Hyderabad-1** District. Those who are willing can contact the District Coordinator.

- **K. Janakiram,** DC, Hyderabad-1
Cell: 80081 32387

ప్రత్యేకం

పడకముందే మేలుకో

నేటి ప్రపంచంలో విశ్వాసులు రెండు మహా అదృశ్య శక్తుల మధ్య జీవిస్తున్నారు. ఒక శక్తి దేవుడైతే, మరొకటి సాతాను. ఈ రెండు శక్తుల పోరాట కేంద్రం 'విశ్వాసి'. దేవుడు మనల్ని తన పవిత్రత వైపు నడిపిస్తుంటే, సాతాను మనల్ని శోధనల ద్వారా దేవునికి దూరం చేయాలని చూస్తుంటాడు. మనం ఎవరి మాటకు లోబడతాము, శోధనను ఎలా ఎదుర్కుంటాము అనేది పూర్తిగా మన నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.

మన తీర్మానం

దేవుని ప్రేమను గ్రహించి, లోకపు ఆకర్షణల కంటే దేవునితో కలిసి జీవించడమే మిన్న అని మనం ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నాము. అయితే, మన విరోధి అయిన సాతాను మనల్ని ఆత్మీయంగా బలహీనపరచడానికి, తిరిగి పాత జీవితంలోకి లాగడానికి నిరంతరం శోధనలను ఎరగా వేస్తుంటాడు. ఈ శోధనలు పైకి ఆకర్షణీయంగా కనిపించినా, వాటి వెనుక ఉన్న ప్రమాదాన్ని గుర్తించి మనం జాగ్రత్త పడాలి.

శోధన అంటే ఏమిటి?

శోధన అంటే దేవుని పవిత్రమైన ప్రణాళిక నుండి, ఆయన సహవాసం నుండి విశ్వాసిని వేరుచేసి, సాతాను శక్తికి లోబడేలా చేయడం. ఇది పాపం చేయాలనే ఆసక్తిని పెంచుతుంది మరియు దేవుని చిత్తానికి అవిధేయత చూపేలా మనల్ని ప్రలోభపెడుతుంది.

శోధనలకు మూలాలు:

ఒక విశ్వాసి శోధనలో పడిపోవడానికి మూడు ప్రధాన కారణాలు ఉంటాయి:

1. సాతాను
2. శరీరం (శరీర ఆశలు)
3. లోకం (లోకపు ఆకర్షణలు)

యాకోబు 1:13 ప్రకారం, శోధనలు దేవుని మూలంగా కలగవు. దేవుడు శోధనలను అనుమతిస్తాడు కానీ ఆయన పెట్టేవి 'పరిశోధనలు'. ఈ పరిశోధనలు మన స్వభావాన్ని నిరూపించడానికి, మన ఆత్మీయతను మెరుగుపరుచుకోవడానికి ఒక అవకాశంగా పనిచేస్తాయి.

సాతాను పన్నాగం

ఈ లోకంలో సాతానుకు రెండే లక్ష్యాలు ఉన్నాయి:

* అవిశ్వాసి ఎప్పటికీ దేవుని దగ్గరకు రాకూడదు
* విశ్వాసి దేవునిలో కొనసాగకూడదు

సాతానుకు తన భవిష్యత్తు శిక్ష తెలుసు, అందుకే వాడు గర్జించే సింహంలా ఎవరిని మింగుదునా అని ఆకలితో వెతుకుతుంటాడు. వాడి పనిలో వాడికి అలసట లేదు.

వ్యక్తిగత బలహీనతలు

మన అనుదిన జీవితంలో వ్యక్తులు, వస్తువులు మరియు వ్యవస్థల ప్రభావం మనల్ని పడగొట్టే అవకాశం ఉంది.

1. **లోక స్నేహితులు:** మనం ఎవరితో స్నేహం చేస్తున్నామనేది చాలా ముఖ్యం. స్నేహితుల కోసం దేవుని విషయంలో రాజీపడకూడదు.
2. **వ్యతిరేక లింగ సంబంధాలు:** నేటి కాలంలో స్త్రీ పురుషుల మధ్య స్నేహం సాధారణమైపోయింది. ఫోన్ కాల్స్, మీటింగ్స్ తప్పు కాకపోవచ్చు కానీ, అది శోధనకు దారితీయకూడదు. దేవుడు అన్ని పాపాలను 'ఎదురించమన్నాడు' కానీ, 'శరీర కోరికల' విషయంలో మాత్రం 'దూరంగా పారి పోమన్నాడు'. అది అగ్ని వంటిది. ఒడిలో ఉంచుకుంటే ఖచ్చితంగా కాలుతుంది.
3. **మొబైల్ ఫోన్:** స్మార్ట్‌ఫోన్ వల్ల దేవునితో గడిపే 'క్వాలిటీ టైం' తగ్గిపోతోంది. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం వల్ల మన చూపులు, ఆలోచనలు దేవునికి దూరమయ్యే ప్రమాదం ఉంది.
4. **సోమరితనం/ఒంటరితనం:** ఖాళీగా ఉండటం వల్ల అనవసరమైన ఆలోచనలు వచ్చి సాతానుకు చోటు ఇస్తాయి. "ఖాళీ మనస్సు దెయ్యానికి నివాసం" అన్నట్లుగా మనం జాగ్రత్త పడాలి.
5. **గర్వం:** లూసిఫర్ తనను తాను గొప్పగా అనుకొని సాతానుగా మారాడు. సంఘంలో లేదా పరిచర్యలో 'నేను' అనే అహంకారం ఉండకూడదు. సాతాను దేని వల్ల పడిపోయాడో, విశ్వాసిని కూడా దానితోనే పడగొట్టాలని చూస్తాడు.
6. **అసంతృప్తి:** ఉన్నదానితో తృప్తి చెందక ధనం, ఆస్తి, అందం లేదా హోదా కోసం ఆరాటపడటం శోధనకు దారితీస్తుంది.
7. **లోకాశ:** లోకం శాశ్వతం కాదని తెలిసి కూడా దాని చుట్టే తిరగడం సాతాను ఉచ్చులో పడటమే.

ఎలా సరిదిద్దుకోవాలి?

* **పిలుపును అర్థం చేసుకుందాం:** ఏ శోధన నిన్ను బలహీనపరుస్తుందో గుర్తించు. దాని నుండి బయటపడాలనే బలమైన కోరిక కలిగి ఉండు. మనం 'ప్రత్యేకంగా' జీవించడానికి పిలవబడ్డామని గుర్తుంచుకో.
* **వాక్యం, ప్రార్థన మరియు విశ్వాసం:** ప్రతిరోజూ 'క్వాలిటీ క్వయిట్ టైం' కలిగి ఉండి బైబిల్ చదవాలి. యేసుక్రీస్తు చెప్పినట్లు, శోధనలో పడకుండా మెలకువగా ఉండి ప్రార్థించాలి. దేవుని బలం లేకుండా శోధనను జయించడం అసాధ్యం.
* **వ్యక్తిగత మెంటర్:** పాపంలో పడకముందే మన ఆత్మీయ స్థితిని పంచుకోవడానికి ఒక ఆత్మీయ మెంటర్ లేదా సహోదరి/సహోదరుడు ఉండటం క్షేమకరం.
* **సహవాసం:** తరచుగా సంఘ ఆరాధనల్లో, ప్రార్థన కూటాల్లో పాల్గొనడం వల్ల ఒకరికొకరు ఆత్మీయ మద్దతునిచ్చుకోవచ్చు.
* **దేవుని భయం:** దేవుడు మన హృదయాలను అంతరింద్రియాలను పరిశీలించేవాడు. మనం నాశనమవుతుంటే ఆయన మౌనంగా ఉండడు, ప్రేమతో శిక్షించి మనల్ని సరిచేస్తాడు.
* **క్రమశిక్షణ:** మొబైల్ వాడకాన్ని తగ్గించడం, మంచి పుస్తకాలు చదవడం మరియు అనవసరపు ఆలోచనల నుండి దూరంగా ఉండటం వంటి కొన్ని సరిహద్దులు ఏర్పరుచుకోవాలి.

  అలాగే పొట్టి వస్త్రాలు, మితిమీరిన జోకులు, చనువు, స్టైల్, మేకప్ వంటి వాటి ద్వారా కూడా సాతానుడు శోధనలోకి నెట్టే అవకాశం ఉందని గ్రహించి, వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

ముగింపు

దేవుడు ఆదాముకు, అబ్రాహాముకు, యోబుకు పరీక్షలు పెట్టాడు. ఆదాము ఓడిపోతే, అబ్రాహాము మరియు యోబు జయించారు. మనం ఓడిపోయిన వారిని చూసి నిరాశ చెందకుండా, జయించిన వారిని మాదిరిగా తీసుకోవాలి. మన ప్రభువైన యేసుక్రీస్తు అన్ని శోధనలను జయించి మనకు ఆదర్శంగా నిలిచారు (హెబ్రీ 5:7).

గుర్తుంచుకోండి: పరిస్థితి ఏదైనా పాపం చేయడానికి అనుమతి లేదు. ఒకవేళ పొరపాటున పడిపోయినా, ఆ 'సెంట్రల్ జైలు' నుండి మనల్ని విడిపించగల శక్తి దేవునికి ఉంది. తక్షణమే ఆయన వైపు తిరుగుదాం.

నూతన సంవత్సర శుభాకాంక్షలు!

– పి. నాగేశ్వరరావు,
స్టాఫ్, ఖమ్మం రీజియన్

రాజీపడని యోధుడు

(గత సంచిక తరువాయి భాగం)

3. ఈ లోక పద్ధతుల విషయంలో రాజీ పడని మొర్దెకై

అహష్వేరోషు రాజు ఆస్థానంలో హామాను ప్రధానమంత్రిగా నియమించబడ్డాడు. రాజాజ్ఞ ప్రకారం, అధికారులు మరియు సేవకులు అందరూ హామానుకు వంగి నమస్కరం చేయాలి. సేవకులు ప్రతిరోజూ హామానుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నప్పటికీ, మొర్దెకై మాత్రం అతన్ని గౌరవించలేదు. "నేను యూదుడను. మీరు చేసినట్లు నేను నమస్కారం చేయలేను," అని మొర్దెకై వారితో స్పష్టంగా చెప్పాడు.

ఈ విషయం హామానుకు తెలిసినప్పుడు, అతను తీవ్రంగా ఆగ్రహించాడు. 'ఈ పరాయి దేశం నుండి వచ్చిన బానిస ప్రాణము తీయుట ఒక స్వల్ప కార్యమే,' అని భావించి, మొర్దెకై జాతి వివరాలను, అతను పూజించే దేవుని గురించి పూర్తి సమాచారం తెలుసుకున్నాడు.

కుయుక్తిగల ఆలోచనతో హామాను ఒక రోజు రాజు వద్దకు వెళ్లి, "రాజా! మీ సంస్థానంలో అన్నింటిలో ఒక జాతివారు చెదరియున్నారు. వారి పద్ధతులు, ఆచారాలు సకల జనులకు వేరుగా ఉన్నవి. అంతేకాక, వారు మీ ఆజ్ఞలను పాటించువారు కారు, గౌరవించువారు కారు. అలాంటి వారిని మన దేశంలో ఉండనిచ్చుట మంచిది కాదు" అని విన్నవించాడు. రాజుకు ఇష్టమైతే, వారిని సంహరించడానికి అనుమతి ఇవ్వవలసిందిగా మనవి చేశాడు.

రాజు వెంటనే తన బంగారు ఉంగరాన్ని తీసి హామానుకు ఇచ్చి, "నీకు ఏది అనుకూలమో దాన్ని చేయుము," అని సెలవిచ్చాడు. రాజు పేరు మీద ఒక శాసనం తయారుచేసి, ఆ శాసనంపై ఉంగరపు ముద్ర వేయబడింది. ఆ శాసనంలో రాయబడిన విషయం ఏమిటంటే: ఆదారు మాసము (12వ నెల) పదమూడవ తేదీన, యవ్వనులనేమి, వృద్ధులనేమి, శిశువులందరిని, స్త్రీలను ఒక్కరోజే బొత్తిగా సంహరించబడాలని 127 సంస్థానాలన్నింటిలోనూ ప్రకటించబడింది.

> **"నీవు ఈ సమయంలో మౌనంగా ఉన్ననూ, యూదులకు సహాయము మరొక దిక్కునుండి తప్పక వచ్చును."**

ఇట్టి భయంకరమైన శాసనం గురించి తెలిసి నప్పటికీ, మొర్దెకై ఏమాత్రం భయపడలేదు, లేదా రాజీపడలేదు. తాను తీవ్రంగా ప్రార్థన చేయడమే కాకుండా, యూదులందరినీ ఉపవాసం ఉండి ప్రార్థన చేయమని ప్రోత్సహించాడు. రాణిగా ఉన్న ఎస్తేరుకు ఈ విషయంలో సలహాలిస్తూ, "నీవు ఈ సమయంలో మౌనంగా ఉన్ననూ, యూదులకు సహాయము మరొక దిక్కునుండి తప్పక వచ్చును," అని ఆమెకు చెప్పాడు.

నేటి కాలంలో కూడా మన దేశంలో క్రైస్తవుల పై మతపరమైన చట్టాలు అమలులోనికి వచ్చే పరి స్థితులు, స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితులు, సువార్త ప్రకటించలేని పరిస్థితులు ఉన్నాయి. మనం కూడా మొర్దెకై వలె భయపడక, రాజీ పడక, ధైర్యంగా దేవుని పక్షంగా నిలబడి ప్రార్థన చేద్దాం.

4. ప్రార్థనాపరుడైన మొర్దెకై

ప్రధానమంత్రిగా ఉన్న హామాను, మొర్దెకై గౌరవించనందుకు, సాష్టాంగ నమస్కారం చేయ నందుకు అతడిపై తీవ్రమైన ద్వేషం పెంచుకున్నాడు. ఈ కక్షతో, హామాను కుయుక్తి పన్ని, రాజ్యంలోని యూదులందరినీ పూర్తిగా సంహరించాలని ఆలోచించాడు. ఈ దుర్మార్గపు ఆలోచనకు రాజు అనుమతి పొంది, శాసనాన్ని రాయించి, రాజ ముద్రతో ముద్రించెను.

ఆ శాసనం ప్రకారం, ఆదారు అనే పన్నెండవ నెల పదమూడవ రోజున, యువకులు, వృద్ధులు, శిశువులు, స్త్రీలు అనే తేడా లేకుండా యూదులందరినీ ఒక్కే రోజున నిర్మూలించాలని, వారి ఆస్తిని కొల్ల సొమ్ముగా పుచ్చుకోవచ్చని ప్రకటించబడింది. ఈ తాకీదులు రాజ్య సంస్థానాలన్నింటికీ పంపబడ్డాయి.

ఈ భయంకరమైన శాసనం గురించి తెలుసు కున్న మొర్దెకై, తీవ్రమైన దు:ఖంతో తన వస్త్రాలు చింపుకొని, గోనెపట్ట కట్టుకొని, బూడిద పోసుకున్నాడు. షూషను కోట మధ్యలోకి వెళ్లి, మహా శోకంతో, రోదనతో రాజగుమ్మం ఎదుట నిలబడ్డాడు. మొర్దెకై తన ప్రజలందరినీ ఉద్దే శించి, దేశంలోని యూదులందరూ ఉపవాసం చేయాలని సలహా ఇచ్చాడు. దీనితో దేశంలోని యూదులందరూ, ముఖ్యంగా షూషను కోట వద్దకు చేరుకున్న యూదులు, ఉపవాసముండి మహా దు:ఖం, ఏడుపులు, రోదనలలో మునిగి పోయారు.

ఈ ఉపవాసం విషయం రాణి ఎస్తేరుకు తెలియడంతో, ఆమె కలత చెందింది. రాజు నియమించిన షండులలో ఒకడైన హతకు ద్వారా మొర్దెకైకి వేరే వస్త్రాలను పంపింది. అయితే, మొర్దెకై వాటిని తీసుకోలేదు. అప్పుడు మొర్దెకై రాణి ఎస్తేరుకు ఈ గంభీరమైన సందేశాన్ని పంపాడు:

> ***"ఓ రాణీ ఎస్తేరు, నీవు రాజనగరంలో ఉన్నందున యూదులందరిలో నీవు మాత్రమే తప్పించుకుంటావని నీ మనసులో తలంచుకోవద్దు. నీవు ఈ క్లిష్ట సమయంలో ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటే, యూదులకు సహాయం, విడుదల మరొక దిక్కు నుండి తప్పక వస్తుంది. కానీ, నీవు, నీ తండ్రి ఇంటివారూ మాత్రం నశించిపోతారు. బహుశా, నీవు ఈ సమయాన్ని దృష్టిలో ఉంచుకునే రాజ్యమునకు వచ్చావేమో ఆలోచించుకో."***

మొర్దెకై మాటలకు చలించిన రాణి ఎస్తేరు, ధైర్యంతో కూడిన నిర్ణయం తీసుకుంది. ఆమె మొర్దెకైతో ఇలా చెప్పమని వర్తమానం పంపింది:

"నీవు వెళ్లి, షూషను కోటలోని యూదులందరినీ సమకూర్చి, నా నిమిత్తం మూడు రోజులు అన్నపానాలు లేకుండా ఉపవాసం ఉండమని చెప్పు. నేను, నా పనికత్తెలు కూడా ఉపవాసం ఉంటాము. ఆ తర్వాత, న్యాయ విరుద్ధమైనప్పటికీ, నేను రాజు వద్దకు వెళ్తాను. నేను నశించవలసి వచ్చిననూ నశించెదను" అనే దృఢమైన తీర్మానం తీసుకుంది.

దీంతో, మొర్దెకై మరియు రాణి ఎస్తేరుతో పాటు యూదులందరూ మూడు రోజులు ఉపవాసం ఉండి, పట్టుదలతో దేవునికి ప్రార్థనలు, విజ్ఞాపనలు చేశారు. వారి ప్రార్థనలు విన్న సర్వశక్తిమంతుడైన దేవుడు, ఎస్తేరు ద్వారా మరొక శాసనాన్ని రాయించి, ఆదారు అనే పన్నెండవ నెల పదమూడవ రోజున యూదులందరినీ అద్భుతంగా కాపాడాడు.

మొర్దెకై, ఎస్తేరు వలె మనం కూడా ప్రార్థన చేస్తే,

పాపపు బానిసత్వంలో జీవిస్తున్న ఎంతోమంది యువతి, యువకులు రక్షించబడతారు. యుఇయస్ఐ గ్రాడ్యుయేట్లుగా, విద్యార్థులుగా, మన దేశంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు పట్టుదలతో ప్రార్థన చేద్దాం.

5. పరాయి దేశంలో ప్రధానమంత్రిగా

ఎస్తేరు రాణిగా నియమించబడిన తర్వాత, మొర్దెకై ప్రతిరోజూ రాజు గుమ్మం వద్ద తిరుగుతూ, దేశంలో జరుగుతున్న పరిస్థితులను క్షుణ్ణంగా గమనించేవాడు. ఒకరోజు, రాజు యొక్క ఇద్దరు ద్వారపాలకులు బిగ్తాను, తెరెషు రాజును చంపడానికి కుట్ర పన్నుతున్న విషయం అతనికి తెలిసింది. ఈ కుట్రను మొర్దెకై వెంటనే రాణి ఎస్తేరుకు తెలియజేశాడు. మొర్దెకై రాజును కాపాడిన విషయం రాణి రాజ సమాచార గ్రంథంలో నమోదు చేయించింది.

ఒక రాత్రి, రాజుకు నిద్ర పట్టకపోవడంతో, రాజ్య సమాచార గ్రంథమును తెప్పించుకుని చదివి వినిపించమని ఆజ్ఞాపించాడు. మొర్దెకై రాజుకు చేసిన సహాయం గురించి తెలుసుకున్న తరువాత, రాజు విచారణ చేయగా అది నిజమని తేలింది. "మొర్దెకై చేసిన ఈ సహాయానికి ఏదైనా బహుమతి లేదా ఘనత ఏదైనా చేయబడిందా?" అని రాజు తన సేవకులను అడిగాడు. "ఏమీ ఇవ్వబడలేదు," అని సేవకులు జవాబిచ్చారు.

సరిగ్గా అదే సమయానికి, యూదులపై ద్వేషంతో రగిలిపోతున్న హామాను మొర్దెకైని చంపడానికి తాను చేయించిన ఉరికొయ్య అనుమతి కోసం రాజు ఆవరణంలో వేచి ఉన్నాడు. సేవకులు రాజుకు ఈ విషయం చెప్పి, "ప్రధానమంత్రి హామాను ఆవరణంలో ఉన్నాడు" అని తెలియజేశారు.

రాజు వెంటనే హామానును పిలిపించి, "తాను గౌరవించాలని ఆశించే వ్యక్తికి రాజు ఏమి చేయాలి?" అని సలహా అడిగాడు. "ఈ గౌరవం నాకే దక్కుతుంది" అని హామాను తన మనసులో అనుకుని, "ఆ వ్యక్తికి రాజవస్త్రాలు ధరింపజేసి, గుర్రంపై ఊరేగిస్తూ రాజవీధులన్నింటిలో ఊరేగింపు చేయాలి" అని సలహా ఇచ్చాడు.

అందుకు రాజు, "నువ్వు చెప్పిన ప్రకారమే శీఘ్రముగా ఆ వస్త్రాలను, గుర్రాన్ని తీసుకుని, రాజు గుమ్మం వద్ద కూర్చున్న యూదుడైన మొర్దెకైకి అలాగే చేయుము" అని ఆజ్ఞాపించాడు. తప్పనిసరి పరిస్థితుల్లో, మనసులో బాధపడుతూ, హామాను మొర్దెకైకి రాజ వస్త్రాలను ధరింపజేసి, గుర్రం మీద ఎక్కించి రాజవీధులలో ఊరేగింపు చేయించాడు. "రాజు గౌరవించాలని ఆశించే వ్యక్తికి ఈ ప్రకారము చేయతగును" అని అతని ముందు చాటించాడు.

ఆ తర్వాత, హామాను తన ఇంటికి వెళ్లి భార్యకు, స్నేహితులకు జరిగిన విషయం తెలియజేసి బోరున ఏడ్చాడు. ఇంతలో, రాణి ఎస్తేరు ఏర్పాటు చేసిన విందుకు రాజును, హామానును పిలవగా వారు విందుకు హాజరయ్యారు. ఈ విందులో, హామాను యూదులను నాశనం చేయడానికి పన్నిన కుట్ర, ముఖ్యంగా మొర్దెకైని చంపడానికి ఏర్పాటు చేసిన ఉరికొయ్య గురించి రాజుకు తెలిసింది. కోపంతో రగిలిన రాజు, "హామానును ఆ కొయ్యపై ఉరి తీయండి!" అని ఆజ్ఞాపించాడు.

ఎస్తేరు విజ్ఞప్తి మేరకు మరియు దేవుని కృప వలన, మొర్దెకై ప్రధానమంత్రిగా నియమించబడ్డాడు. తన వారందరితో శాంతియుతంగా మాట్లాడుతూ, తన ప్రజల క్షేమాన్ని నిత్యం విచారించేవాడు. ఆయన తన దేశస్థులలో చాలామందికి ఇష్టుడుగా, యూదులలో గొప్పవాడిగా ఉన్నాడు.

> **"ఆయన యథార్థవంతులను వర్ధిల్ల జేయును" (సామె *2:7*)**

దేవునియందు విశ్వాసముంచి, యథార్థవంతుడిగా జీవించినందువల్లే ఆయన ప్రార్థన విని యూదులను కాపాడాడు, తద్వారా మొర్దెకైకి ఉన్నతమైన ప్రధానమంత్రి పదవి అనుగ్రహించబడింది. మనం విద్యార్థులుగా, లేదా గ్రాడ్యుయేట్లుగా దేవుని కోసం రోషంతో, విశ్వాసంతో, యథార్థంగా జీవిస్తే దేవుడు తప్పని సరిగా మనలను కూడా ఉన్నత స్థితికి హెచ్చిస్తాడు.

– కె. బర్నబాస్ (భద్రయ్య),
టీచర్, మంచిర్యాల

మన గత జీవితం గూర్చి ఎప్పుడు ఆలోచించినా, సాధారణంగా అది మనల్ని ఎప్పుడూ నిరాశ పరుస్తుంది. నేను ఆ పరిస్థిలో ఆ విధంగా చేయకుండా ఉండాల్సింది అని బాధపడుతూ ఉంటాం. జరిగిన తప్పుల పట్ల పశ్చాత్తాపం అవసరమే అయినా, గత కాలపు చేదు జ్ఞాపకాలలో మనల్ని మనం బంధించుకొని, నిందించుకొంటూ మనకున్న సమయాన్ని చింతిస్తూ వెళ్ళబుచ్చడం సరైనది కాదు. వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడాలి (అపొ. 3:13-14). ఎందుకంటే జరిగిన గతాన్ని ఏమి చేసినా మనం మార్చలేము, కాని దేవుని కృపతో భవిష్యత్తుని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చు.

1. గత కాలపు నిరాశ: యాకోబు అనుభవం

యాకోబు తన వృద్ధాప్యంలో ఐగుప్తు రాజు ఫరోను కలిసినప్పుడు, ఫరో తన వయస్సు గురించి అడిగాడు. దానికి యాకోబు, “నేను యాత్ర చేసిన సంవత్సరములు నూట ముప్పది; నా జీవిత దినములు కొంచెముగాను, దు:ఖసహితముగాను ఉన్నవి” అని బదులిచ్చాడు (ఆది 47:9).

యాకోబు మాటలను బట్టి తన గత జీవితం పట్ల ఆయన ఎంతటి అసంతృప్తితో ఉన్నాడో స్పష్టమవుతుంది. అన్నను, తండ్రిని మోసగించడం, మామ లాబాను వద్ద దశాబ్దాల పాటు వెట్టిచాకిరీ చేయడం, కుటుంబంలో కలహాలు, కుమార్తె దీనా అత్యాచారం గావించబడడం, కొడుకుల హింసాత్మక ప్రవృత్తి – ఇలా తన జీవితం ఎన్నో ఒడిదుడుకులతో సాగింది. పరిస్థితులు కొంత కారణమైనా, యాకోబు అసంతృప్తికి ప్రధాన కారణం తన సొంత నిర్ణయాలు, గత పొరపాట్లే. మన జీవితాలను కూడా వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, అవి అర్థరహితంగా అనిపించవచ్చు. కానీ, దేవుని సహాయంతో భవిష్యత్తును అర్థవంతంగా మలచుకోవచ్చు.

ఉదాహరణకు, మీకు ఇప్పుడు 25 ఏళ్లు ఉండి, గతాన్ని వృధా చేశానని మీరు భావిస్తే.. మీ వయస్సు 50 ఏళ్లు అని ఊహించుకోండి. అప్పుడు రాబోయే మరో 25 ఏళ్లను దేవుని సహాయంతో ఎంత ప్రభావవంతంగా, ఫలభరితంగా మార్చుకోవచ్చో ఆలోచించండి. ప్రభువు నిన్ను ఏవిధంగా చూడాలనుకుంటున్నాడో గుర్తించండి.

2. లక్ష్యబద్ధమైన ప్రయాణం: అపొస్తలుడైన పౌలు సాక్ష్యం

యాకోబుకు భిన్నంగా, అపొస్తలుడైన పౌలు తన జీవితాంతంలో ఎంతో ధీమాగా ఇలా ప్రకటించాడు.

> ***“మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని” అని (2 తిమోతి 4:7).***

పౌలు జీవితం కూడా శ్రమలతోనే నిండి ఉంది. ఎన్నో కొరడా దెబ్బలు, రాళ్ళ దెబ్బలు తిన్నాడు, అనేక సార్లు జైలు పాలయ్యాడు. ముమ్మారు ప్రాణాపాయంలో ఉన్నాడు. జీవితమంతా ఎన్నో అపాయాలు. ప్రవాహాల వల్ల, దోపిడీదొంగల వల్ల,

స్వజనం వల్ల, ఇతర జనాల వల్ల, పట్టణాలలో, అరణ్యాలలో, సముద్రంలో ఇలా ఎన్నో అపాయాలు ఎదురయ్యాయి. అనేక నిద్ర రాని రాత్రులు గడిపాడు. ఆకలిదప్పులతో ఉన్నాడు. ఆయనకున్న అర్హతలకు అతడు అన్ని శ్రమలు పడాల్సిన అవసరం ఇసుమంత కూడా లేదు. అయినా తన శ్రమలను బట్టి ఎప్పుడు చింతించలేదు, పైగా అతిశయించాడు. శ్రమల గుండా వెళ్ళిన పౌలుకు మరియు యాకోబుకు తమ గత జీవితం పట్ల ఉన్న దృక్పథంలోని అంత వ్యత్యాసం దేనికంటే దమస్కు మార్గంలో పౌలుకు కలిగిన ప్రభువు దర్శనం. పౌలు జీవితాన్ని దేవుడు దర్శించిన తర్వాత ఆయన అడిగిన రెండు ప్రశ్నలు ఆయన జీవిత దిశను మార్చేశాయి (అపో. 22:8,10):

1. ***"నీవెవడవు?" (దేవుని తెలుసుకోవడం)***
2. ***"నేనేమి చేయవలెను?" (దేవుని ఉద్దేశ్యాన్ని తెలుసుకోవడం)***

అందుకు ప్రభువు అన్యజనులు చీకటిలో నుండి వెలుగు లోనికిని సాతాను అధికారమునుండి దేవుని వైపుకును తిరిగి, నా యందలి విశ్వాసం చేత పాపక్షమాపణను, పరిశుద్ధపరచ బడినవారిలో స్వాస్థ్యమును పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారియొద్దకు పంపెదనని చెప్పెను (అపో. 26:18). అంతే తన మిగతా జీవితమంతా ప్రభువు ఇచ్చిన ఆ దర్శనం మీదనే కట్టుకున్నాడు. పౌలు తాను పొందిన దర్శనం కొరకు జీవిస్తున్నప్పుడు తన జీవితంలోని ప్రతి విషయం, శ్రమలు కూడా ఎంతో అర్థవంతంగా మారాయి.

3. దైవ ప్రణాళిక

ఈ విశ్వం పట్ల దేవునికి ఒక గొప్ప సంకల్పం ఉంది (ఎఫెసీ 1:9-10). ఆ సంకల్పంలో మనకు కూడా ఒక విశిష్టమైన పాత్ర ఉంది. "యెహోవా ప్రతి వస్తువును దాని దాని పని నిమిత్తము కలుగజేసెను" (సామె 16:4), అనగా దేవునికి నీ పట్ల కూడా ఒక ఉద్దేశం ఉంది.

దేవుని సంకల్పంలో ప్రతి ఒక్కరికీ ఒక ఉద్దేశ్యం ఉంటుంది. అది ఒక కులానికో, ఒక వర్గానికో లేదా కేవలం జ్ఞానులకో పరిమితం కాదు. లోకం దృష్టిలో మీరు సామాన్యులైనా, దేవుని రాజ్యంలో మీరు ఎంతో విలువైన వారు. నీవెంత బలహీనుడవైన దేవుడు తన మహిమార్థమై నిన్ను వాడుకోగల సమర్థుడు.

4. దైవ దర్శనమును కోరుము

"దర్శనం లేని ప్రజలు అదుపు లేకుండా తిరుగుతారు" (సామె 29:18). దర్శనం అంటే "భవిష్యత్తును విశ్వాసంతో ముందే చూడగలగడం". ఇది గాలిలో మేడలు కట్టడం కాదు; దేవుని చిత్తాన్ని, మన సామర్థ్యాలను బేరీజు వేసుకుంటూ అడుగులు వేయడం.

మీ జీవిత దర్శనమును రూపొందించుకోవడానికి కొన్ని సూత్రాలు:

* **ప్రార్థించు:** దైవ దర్శనం ప్రార్థన ద్వారానే దొరుకుతుంది. "ప్రభువా, నా ద్వారా నీవు ఏమి చేయాలనుకుంటున్నావు?" అని అడగాలి. ఆయన సన్నిధిలో మౌనంగా ఉండి ఆయన స్వరాన్ని వినాలి.
* **ధ్యానించు:** దేవుని వాక్యం మనల్ని మనకు పరిచయం చేస్తుంది. ఆయన వాక్యం ద్వారానే మన ఉనికిలోని అసలు ఉద్దేశ్యం వెల్లడవుతుంది.
* **గుర్తించు:** దేవుడు మీకు ఇచ్చిన తలాంతులను, మీ హృదయంలోని భారాన్ని గుర్తించండి. మీరు దేని పట్ల ఎక్కువ ఆసక్తి కలిగి ఉన్నారు? మీ పని ఎవరికి ప్రయోజనకరం? అని ఆలోచించాలి.
* **రచించు:** దేవుడు ఇచ్చిన ఆలోచనలను స్పష్టంగా రాసుకోవాలి (హబక్కూకు 2:2). వ్రాయబడిన లక్ష్యానికి ఒక అధికారికత ఉంటుంది; అది మనల్ని నిరంతరం ప్రేరేపిస్తూ, దారి తప్పకుండా చేస్తుంది.

5. ముగింపు

ఏ వస్తువైనా అది తయారు చేయబడిన ఉద్దేశం కోసం కాకుండా, వేరే దేనికి వాడబడిన అది వ్యర్థమే. మన జీవితం కూడా దేవుని ఉద్దేశానుసారం సాగకపోతే, జీవితంలో ఏమి సాధించినా వ్యర్థమే.

దేవుని చిత్తంలో బ్రతికే వారికి లోకమిచ్చే గుర్తింపుతో పని ఉండదు. శ్రమలు ఎదురైనా వారు కృంగిపోరు. చాలాసార్లు మనం "ఏదో ఒక సేవ" చేస్తున్నాం కదా అని తృప్తి పడతాం, కానీ "దేవుడు నన్ను చేయమన్న పని ఇదేనా?" అని ఆలోచించాలి. దేవుడు మనమెంత సేవ చేసామని కాదు, ఆయన చెప్పిన పని చేసామా లేదా అని చూస్తాడు. పౌలు వలె నా పరుగు కడముట్టించితిని అని చెప్ప గలిగితే అంతకు మించిన ధన్యకరమైన జీవితమేముంది!

– నాని బాబు, బోయన్‌పల్లి జోన్,
హైదరాబాద్

జనవరి '26 యెహెజ్కేలు గ్రంథము (21 - 22 అధ్యాయాలు)



అడ్డం

2. నా జనులకు తటస్థించినది గనుక నీ తొడను ఏమి చేసికొనుము?
3. నీలో తండ్రిలేని వారును విధవరాండ్రును ఏమి చేయబడుదురు?
7. నీవు పెట్టుకొనిన వేటి చేత నిన్ను నీవే అపవిత్ర పరచుకొంటివి?
8. నన్ను మరచిపోయి దేనికై లంచము పుచ్చుకొను వారు నీలో నున్నారు?
9. అందరును అల్లరితో నిండినదానవనియు నిన్ను ఏమి చేతురు?

నిలువు

1. నా ఖడ్గము మరల ఒరలోపడకుండ దాని దూసి యున్నానని ఎవరు తెలిసికొందురు?
4. ఏ ఖడ్గము వచ్చుటకు రెండు మార్గములను ఏర్పరచుము?
5. నీలో ఏ చేష్టలు జరుగుచున్నవి?
6. నీలో ఎవరును ఉండకుండ అందరిని నిర్మూలము చేయుటకై ఏమి ఒరదూసియున్నాను?
8. ఇశ్రాయేలీయుల ప్రధానులందరును తమ శక్తి కొలది ఏమి చేయుదురు?

– కె.కిరణ్ కుమార్,
స్టాఫ్, మహబూబ్‌నగర్

డిసెంబర్ '25 యెహెజ్కేలు గ్రంథము (19 - 20 అధ్యాయాలు)

అడ్డం: 3. దక్షిణ, 4. ఆడు సింహము, 5. నా హస్తము, 6. బబులోను, 7. విశ్రాంతి, 9. ఐగుప్తుదేశమునకు.

నిలువు: 1. దూషణ, 2. కొదమ సింహముల, 5. నా విధులను, 6. బహురౌద్రము, 8. తిరుగుబాటు.

విజేతలు:

1. జ్యోతి గంగారాం, కొంపల్లి, 2. మేసు స్వప్న తుకారం, రాజన్న సిరిసిల్ల 3. వినోద్ కుమార్, నిర్మల్

చేతి స్పర్శ

యేసయ్య వస్త్రపు చెంగును ముట్టిన
స్త్రీ రక్తస్రావం ఆగిపోయింది.
యేసయ్య చేతి స్పర్శ గుడ్డివాని
కనులకు చూపునిచ్చింది.
ఈ లోకంలో నీకున్న సమస్యలన్నిటికీ
ఒక్కటే పరిష్కారం.

యేసయ్య చేతి స్పర్శ నీకు తగిలితే,
నీ సమస్యలన్నీ మటుమాయమైపోతాయి.
ఆయన చేతి స్పర్శ కేవలం ఆయన సన్నిధిలో
గడిపే వారికి మాత్రమే దొరుకుతుంది.

ప్రియ మిత్రమా, ఈరోజు నీవు దేవుని
చేతి స్పర్శను అనుభవించావా?
నేటి నుంచైనా ఆయన చేతి స్పర్శకై
దేవుని సన్నిధిలో సాగిలపడు.

– **రవికుమార్,** ఖమ్మం

UESI PUBLICATIONS Since 1988

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited, Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)